# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

సంపుటి : 1 సంచిక : 34 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 16 డిసెంబర్ 2025 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 34 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 16 DECEMBER 2025 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# ఏపీ ప్రాజెక్టులకు కేంద్రం అండ...

## మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో లోకేశ్ కీలక భేటీ

- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ
- రాష్ట్రవ్యాప్త నైపుణ్య గణనకు సహకరించాలని విజ్ఞప్తి
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు మద్దతు కోరిన లోకేశ్
- ఏపీలో ఏఐ మిషన్ వేగవంతానికి సాయంపై కీలక చర్చ
- లోకేశ్ వినతులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో చేపట్టనున్న పలు కీలక ఐటీ, నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. లోకేశ్ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో చేపట్టనున్న నైపుణ్య గణన కోసం ఏఐ టెక్నాలజీతో రూపొందించిన 'నైపుణ్యం పోర్టల్' గురించి లోకేశ్ కేంద్ర మంత్రికి వివరించారు. ఇప్పటికే మంగళగిరిలో పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించామని, ఎదురైన సవాళ్లను అధిగమించేందుకు ఏఐ ఆధారిత ఇంటర్వ్యూ విధానాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే

వివరాలు 2లో..



## లోక్‌సభలో వైసీపీపై విమర్శల వర్షం కురిపించిన కేశినేని చిన్ని

- 17 మెడికల్ కాలేజీల హామీని నిలబెట్టుకోలేదని విమర్శ
- రూ.500 కోట్లతో రాజభవనం కట్టారని, ఆ డబ్బుతో కాలేజీలు కట్టొచ్చని వ్యాఖ్య
- పీపీపీకి, ప్రైవేటీకరణకు తేడా తెలియదా? అని మండిపాటు



పెన్ పవర్ డెస్క్:లోక్‌సభలో అనుబంధ పద్దులపై జరిగిన చర్చలో టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా, మెడికల్ కాలేజీల విషయంలో ప్రజలను, విద్యార్థులను దారుణంగా మోసం చేసిందని ఆరోపించారు. నాలుగేళ్లలో 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తామని గొప్పలు చెప్పి, ఒక్కటి కూడా ప్రారంభించలేదని శివనాథ్ ఎండగట్టారు. వైసీపీ పాలనలో రాష్ట్ర వైద్య రంగం పూర్తిగా పతనమైందని అన్నారు. ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పీపీపీ మోడల్‌లో కాలేజీలు నిర్మిస్తుంటే, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి వైసీపీ వ్యతిరేకిస్తోందని మండిపడ్డారు. పీపీపీ మోడల్‌లో 100 శాతం ప్రభుత్వ నియంత్రణ, 50 శాతం ప్రభుత్వ కోటా సీట్లు ఉంటాయని, వైసీపీ నేతలకు పీపీపీకి ప్రైవేటీకరణకు తేడా కూడా తెలియకపోవడం విచారకరమని వ్యాఖ్యానించారు.వైసీపీ నాయకుడి

వివరాలు 2లో..



## ఇండిగో గందరగోళంపై పిల్... విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ

- ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో విచారణ జరుగుతోందని వెల్లడి
- పిటిషనర్‌ను హైకోర్టునే ఆశ్రయించాలని సూచించిన ధర్మాసనం
- విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పిల్
- పరిస్థితి చక్కబడుతోందని ప్రకటించిన ఇండిగో యాజమాన్యం

వివరాలు 2లో..

# తాడిపత్రిలో మళ్లీ రాజకీయ వేడి..

## పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డి సవాల్

- కేతిరెడ్డి ఫిర్యాదుపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి
- అక్రమ నిర్మాణాలు నిరూపిస్తే కూల్చేందుకు సిద్ధమని ప్రకటన
- పెద్దారెడ్డి తండ్రి విగ్రహానికి వినతిపత్రం ఇస్తామన్న జేసీ



పెన్ పవర్ డెస్క్:అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. భూకబ్జా ఆరోపణలపై పెద్దారెడ్డి చేసిన ఫిర్యాదుకు జేసీ ప్రభాకర్ రెడ్డి గట్టిగా బదులిచ్చారు. ఆరోపణలు చేయడం కాదు, దమ్ముంటే వచ్చి అక్రమ నిర్మాణాలు ఎక్కడున్నాయో నిరూపించాలని పెద్దారెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు.ఎర్ర కాలువ, రహదారి నిర్మాణంపై కేతిరెడ్డి పెద్దారెడ్డి రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జేసీ ప్రభాకర్ రెడ్డి స్పందించారు. "ఎర్ర కాలువ, రోడ్డు కోసం స్థల యజమానులతో మాట్లాడి ఏడు మీటర్ల స్థలాన్ని పంచాయతీరాజ్‌కు అప్పగించాం. నిధులు లేకపోవడంతో ఆ పనిని ఆర్ అండ్ బీ శాఖకు బదిలీ చేశారు. వారు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చారు. ఆ ప్రాంతంలోని భూమి మొత్తం ప్రైవేటు వ్యక్తులదే. వారే 20 మీటర్ల స్థలాన్ని రోడ్డు కోసం వదిలి ప్లాట్లు వేసుకున్నారు" అని జేసీ వివరించారు. అయితే, ఇందులో అక్రమ ప్లాట్లు ఎక్కడున్నాయో పెద్దారెడ్డి వచ్చి నిరూపించాలని జేసీ డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను నిరూపించాలంటూ తమ కౌన్సిలర్లు ఉదయం పెద్దారెడ్డి తండ్రి విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తారని తెలిపారు. "పెద్దారెడ్డి వచ్చి ఏ నిర్మాణం అక్రమమని చూపిస్తే, దానిని కూల్చివేయడానికి నేను సిద్ధం" అని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

## వాజ్‌పేయి స్ఫూర్తితోనే మోదీ ప్రధానిగా ఎదిగారు

- నమ్మిన సిద్ధాంతాల కోసం నిలబడిన నేత వాజ్‌పేయి అని సత్యకుమార్ కితాబు
- మోదీ పాలనలో దేశంలో పెద్ద ఉగ్రదాడులు లేవని వ్యాఖ్య
- విశాఖ, అమరావతిలో త్వరలో మెట్రో రైలు ప్రాజెక్టులు వస్తాయన్న మంత్రి

వివరాలు 2లో..



## తిరిగి వస్తా... భారత అభిమానులకు మెస్సీ హామీ... ముగిసిన గోట్ టూర్

- ఢిల్లీలో ఘనంగా ముగిసిన మెస్సీ భారత పర్యటన
- అరుణ్ జైట్లీ స్టేడియంను ముంచెత్తిన అభిమానులు
- భారత అభిమానుల ప్రేమకు మెస్సీ భావోద్వేగం
- తప్పకుండా మళ్లీ వస్తానని అభిమానులకు హామీ
- క్రికెట్ పెద్దలతో భేటీ.. టీ20 వరల్డ్ కప్ టికెట్ అందుకున్న మెస్సీ

వివరాలు 2లో..



## రఘురామ కేసు: విచారణకు హాజరైన ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్

- రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో విచారణకు హాజరైన సునీల్ కుమార్
- గుంటూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో సునీల్ కుమార్ విచారణ
- రెండో నోటీసుతో విచారణకు వచ్చిన సునీల్ కుమార్



పెన్ పవర్ డెస్క్:సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ గుంటూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో హింసించారన్న కేసులో సునీల్ కుమార్ ప్రధాన నిందితుడిగా (ఏ1) ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసుకు సంబంధించి

వివరాలు 2లో..

## ఏపీలో హార్ట్‌ఫుల్‌నెస్ విస్తరణ.. దాజీతో సమాలోచనలు జరిపిన సీఎం

- రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతి వనాన్ని సందర్శించిన చంద్రబాబు
- శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు దాజీతో ప్రత్యేకంగా సమావేశం
- ఏపీలో హార్ట్‌ఫుల్‌నెస్ కార్యాలయం ఏర్పాటుపై కీలక చర్చలు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రంగారెడ్డి జిల్లా చేగూరులోని ప్రఖ్యాత కన్హా శాంతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ అధ్యక్షుడు కమలేశ్ డి పటేల్ (దాజీ) ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు, దాజీ ప్రత్యేకంగా సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు.

వివరాలు 2లో..

## ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు.. 100 విమానాల రద్దు

- 'తీవ్ర' స్థాయికి చేరిన వాయు నాణ్యత సూచీ
- వంద విమానాల రద్దు.. 300కి పైగా ఆలస్యం
- పలు రైళ్లు 6 నుంచి 7 గంటల పాటు ఆలస్యంగా నడుస్తున్న వైనం
- నిర్మాణాలపై నిషేధం, ఆఫీసులకు వర్క్ ఫ్రమ్ హోమ్
- ఢిల్లీకి 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

పెన్ పవర్ డెస్క్:దేశ రాజధాని ఢిల్లీని ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. వాయు కాలుష్యం 'తీవ్ర' స్థాయికి చేరడంతో నగరం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. గాలి నాణ్యత సూచీ (AQI) ప్రమా దకర స్థాయికి పడిపోవడంతో దృశ్యమానత (visibility) తగ్గింది. ఫలితంగా విమాన,



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# జనసేనలో ఈ డేంజర్ సిగ్నల్స్ ను ఎవరైనా గమనించారా?

జనసేన ఒకరకంగా సైలెన్స్ గా ఉంది. క్యాడర్ నుంచి నేతల వరకూ అందరూ నోటికి తాళం వేసుకున్నట్లే కనిపిస్తుంది. ఎవరు ఏమనుకున్నా ఇంతకు ముందు కనిపించిన జోష్ నేడు జనసేనలో కనిపించకపోవడం ప్రతి ఒక్కరూ పసిగట్టే ఉంటారు. ఎందుకంటే గత రెండేళ్ల నుంచి నామినేటెడ్ పదవుల విషయంలోనూ, నియోజకవర్గాల్లో తమను టీడీపీ నేతలు పట్టించుకోకపోవడం ఈ సైలెన్స్ కు ముఖ్యకారణమని చెప్పాలి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై ప్రత్యర్థులు చేసే విమర్శలకు కూడా ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. గతంలో సోషల్ మీడియాలోనూ, వివిధ వేదికల ద్వారా పవన్ కల్యాణ్ పై ఈగవాలినా స్పందించే వారు నేడు పెదవి విప్పడానికి సిద్ధపడటం లేదు.

**అధినేత పై విమర్శలను కూడా...**

ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ గమనించి ఉండవచ్చు. గమనించినా పట్టించుకోకపోయి ఉండవచ్చు. నిన్న కాక మొన్న కోనసీమ కొబ్బరి విషయంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ నేతలు సీరియస్ గా స్పందించినా దానిని ఖండించడానికి మంత్రి నాదెండ్ల మనోహర్ మినహా మరొక నేత ముందుకు రాలేదు. అందులోనూ కోనసీమ నుంచి ఎవరూ ఖండించకపోవడం కూడా గమనించాల్సిన విషయం. ఇక సోషల్ మీడియాలోనూ పవన్ కు అనుకూలంగా పెద్దగా పోస్టులు కనిపించడం లేదు. గతంలో ఇరగబడి పోస్టులు పెట్టి తమ అభిమాన నేతపై మాట పడనివ్వకుండా చేసిన వారు సయితం ఇప్పుడు చేతులు కట్టుకుని కూర్చుని ఉండటం డేంజర్ సిగ్నల్స్ అని చెప్పాలి.

**నోరు, చేయి కదపకుండా...**

2024 ఎన్నికలకు ముందు.. తర్వాత జనసేనలో పరిస్థితులు మారిపోయాయి. పవన్ కల్యాణ్ తో పాటు ఇద్దరు మంత్రులను పక్కన పెడితే దాదాపు పద్దెనిమిది మంది శాసనసభ్యులున్నారు. ఇద్దరు ఎంపీలున్నారు. వారు కూడా నోరు మెదపడం లేదు. అలాగే కొందరు కరడు గట్టిన జనసేన క్యాడర్ గతంలో సోషల్ మీడియాలో యాక్టివ్ గా కనిపించేవారు. కానీ రెండేళ్ల నుంచి తమను పట్టించుకోకపోవడం, తమ గోడు వినేవారు పార్టీలో లేకపోవడంతో క్యాడర్ నుంచి లీడర్ల వరకూ ఒకరకమైన నైరాశ్యం అలుము కుంది. ఇప్పటికైనా ఈ సంకేతాలను పవన్ కల్యాణ్ గమనించి ఒకింత క్యాడర్ కు చేరువయ్యే కార్యక్రమాలను చేపట్టాలి. అలాగే వారికి భరోసా ఇచ్చేలా వారితో సమావేశమవ్వాలి. లేకుంటే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయని జనసేన నేతలే ఆందోళన చెందుతున్నారు.

# వాజ్‌పేయి స్ఫూర్తితోనే మోదీ ప్రధానిగా ఎదిగారు

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని స్ఫూర్తిగా తీసుకునే ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని పాలిస్తున్నారని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. వాజ్‌పేయి వ్యక్తిత్వం, ఆలోచనా విధానం, పాలనా శైలి మోదీకి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. నెల్లూరులో జరిగిన 'అటల్ మోదీ సుపరిపాలన యాత్ర' సభలో ఆయన ప్రసంగించారు. వాజ్‌పేయిని అత్యంత దగ్గరగా చూసిన వ్యక్తిగా ఆయన గొప్పతనాన్ని అర్థంచేసుకున్నానని సత్యకుమార్ చెప్పారు. 63 ఏళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్నా, బీజేపీ కేవలం రెండు సీట్లు గెలిచినప్పుడు కూడా ఆయన మనోస్థైర్యం కోల్పోలేదని గుర్తుచేశారు. "అపజయాన్ని అంగీకరించను, కాలం రాసిన రాతను మారుస్తా" అంటూ కవిత్వం ద్వారా ఆయన చూపిన ఆత్మవిశ్వాసమే బీజేపీకి కొత్త మార్గం వేసిందని తెలిపారు.
వాజ్‌పేయి వేసిన బాటలోనే నరేంద్ర మోదీ వంటి ఎందరో నేతలు ఎదిగారని, ఆయన స్ఫూర్తితోనే మోదీ దేశ ప్రధాని అయ్యారని సత్యకుమార్ కొనియాడారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక విషయాన్ని వెల్లడించారు. త్వరలోనే విశాఖపట్నం, అమరావతిలో మెట్రో రైలు ప్రాజెక్టులు రానున్నాయని మంత్రి ప్రకటించారు.రక్షణ, వ్యవసాయ రంగాల్లో వాజ్‌పేయి నాటిన విత్తనాలే నేడు ఫలాలు ఇస్తున్నాయని చెప్పారు. పాకిస్థాన్‌కు స్నేహహస్తం అందించినా కుట్రలు ఆపకపోవడంతో సమరానికి సిద్ధమై బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. గడచిన 11 ఏళ్ల మోదీ పాలనలో దేశంలో ఒక్క పెద్ద ఉగ్రదాడి కూడా జరగలేదని, సర్జికల్ స్ట్రైక్స్‌తో భారత్ తన సత్తా చాటిందని తెలిపారు.

# ఇండిగో గందరగోళంపై పిల్...
## విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ

ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో ఇటీవల నెలకొన్న తీవ్ర అంతరాయాలు, విమానాల రద్దుపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) విచారించేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఈ అంశంపై ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో విచారణ జరుగుతున్నందున, అక్కడే తమ వాదనలు వినిపించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది.ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిల్‌ను విచారించింది. న్యాయవాది నరేంద్ర మిశ్రా స్వయంగా ఈ పిల్‌ను దాఖలు చేశారు. ఇదే అంశంపై ఢిల్లీ హైకోర్టులో విచారణ కొనసాగుతోందని, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసిందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ఒకే అంశంపై రెండు చోట్ల సమాంతర విచారణలు అవసరం లేదని పేర్కొంది. పిటిషనర్ తన వాదనలను ఢిల్లీ హైకోర్టులో వినిపించేందుకు అనుమతించాలని ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది.ఇటీవల ఇండిగో విమానాలు భారీ సంఖ్యలో రద్దు కావడం, ఆలస్యం అవ్వడంతో ప్రధాన విమానాశ్రయాల్లో 'మానవతా సంక్షోభం' తలెత్తిందని పిటిషనర్ తన పిల్‌లో ఆరోపించారు. వృద్ధులు, చిన్నారులతో సహా వేలాది మంది ప్రయాణికులు ఆహారం, నీళ్లు, సరైన వసతులు లేకుండా గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంలోని
ఆర్టికల్ 21 (జీవించే హక్కు)కు భంగం కలిగించడమేనని వాదించారు.మరోవైపు ఈ అంశంపై విచారణ జరుపుతున్న ఢిల్లీ హైకోర్టు, లక్షలాది మంది ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసేలా పరిస్థితిని ఎందుకు దిగజార్చారని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఈ కేసు తదుపరి విచారణను జనవరి 22కి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా.. తమ కార్యకలాపాలు క్రమంగా సాధారణ స్థితికి వస్తున్నాయని, ఈ నెల 12న 2,050 విమానాలు నడపగా కవలం రెండు మాత్రమే రద్దయ్యాయని ఇండిగో ప్రకటించింది.

# లోక్‌సభలో వైసీపీపై విమర్శల వర్షం కురిపించిన కేశినేని చిన్ని

- మొదటి పేజి తరువాయి
కోసం రూ.500 కోట్లతో రాజభవనం నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని శివనాథ్ ఆరోపించారు. ఆ డబ్బుతో రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు నిర్మించి ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.
అలాగే, రాష్ట్రానికి సంబంధించిన ఇతర కీలక అంశాలను కూడా ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ భారతదేశంలో మెట్రో రైలు లేని ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గుర్తుచేశారు. విజయవాడ, విశాఖ నగరాలకు మెట్రో ప్రాజెక్టులు ప్రాంతీయ అభివృద్ధికి అత్యవసరమని, 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు ఇవి దోహదపడతాయని తెలిపారు. యూరియా సబ్సిడీ కోసం కేంద్రం రూ.31,000 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తూ, ఏపీలో యూరియా సంక్షోభాన్ని పరిష్కరించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో దేశం 8.2 శాతం జీడీపీ వృద్ధి రేటును సాధించిందని కేశినేని శివనాథ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# ఏపీ ప్రాజెక్టులకు కేంద్రం అండ...

- మొదటి పేజి తరువాయి
ఈ బృహత్ కార్యక్రమానికి కేంద్రం సహాయం అందించాలని కోరారు.అలాగే రాష్ట్రంలోని యువ పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు కేంద్రం అండగా నిలవాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఐటీ శాఖ పరిధిలోని '%వీవక్%' స్టార్టప్ హబ్' ద్వారా మద్దతు అందించాలని కోరారు. ఇదే హబ్‌లో యానిమేషన్, ఏఆర్/వీఆర్ వంటి అత్యాధునిక టెక్నాలజీస్ కోసం ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కూడా సహకరించాలని విన్నవించారు. ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలో కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణను వేగవంతం చేసేందుకు మద్దతివ్వాలని కోరారు. ఈ భేటీలో లోకేశ్ వెంట కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ఎంపీలు కూడా ఉన్నారు.

# రఘురామ కేసు: విచారణకు హాజరైన ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్

- మొదటి పేజి తరువాయి
అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు.విజయనగరం ఎస్పీ దామోదర్ ఈ కేసులో విచారణాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలోనే సునీల్ కుమార్ విచారణ కొనసాగుతోంది. తొలుత డిసెంబర్ 4న విచారణకు రావాలని గత నెల 26న అధికారులు సునీల్ కుమార్‌కు తొలిసారి నోటీసులు జారీ చేశారు. అయితే, కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాల రీత్యా తనకు గడువు కావాలని ఆయన కోరారు.ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న అధికారులు, డిసెంబర్ 15న తప్పనిసరిగా హాజరుకావాలని ఈ నెల 6న రెండోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సునీల్ కుమార్ ఇవాళ గుంటూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి విచారణకు హాజరయ్యారు.

# తిరిగి వస్తా... భారత అభిమానులకు మెస్సీ హామీ... ముగిసిన గోట్ టూర్

ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత పర్యటన ఘనంగా ముగిసింది. తన 'గోట్ ఇండియా టూర్'లో భాగంగా సోమవారం మెస్సీ చివరిగా ఢిల్లీలో సందడి చేశాడు. రాజధానిలోని అరుణ్ జైట్లీ స్టేడియం ఫుట్‌బాల్ అభిమానులతో కిక్కిరిసిపోయింది. అర్జెంటీనా జెర్సీలు, మెస్సీ ఫొటోలతో స్టేడియం మొత్తం నీలి సముద్రాన్ని తలపించింది. అభిమానుల కేరింతల మధ్య మెస్సీ తన పర్యటనకు మధురమైన ముగింపు పలికాడు.వాతావరణం అనుకూలించకపోవడంతో సోమవారం మధ్యాహ్నం నాటికి మెస్సీ ఢిల్లీకి చేరుకున్నాడు. లీలా ప్యాలెస్ హోటల్‌లో బస చేసిన అనంతరం నేరుగా అరుణ్ జైట్లీ స్టేడియానికి బయలుదేరాడు. అప్పటికే వేలాది మంది అభిమానులు తమ ఆరాధ్య ఆటగాడి కోసం ఎదురుచూస్తున్నారు. సెలబ్రిటీ మెస్సీ ఆల్ స్టార్స్, మినర్వా మెస్సీ ఆల్ స్టార్స్ మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగినా, అందరి దృష్టి మెస్సీ కోసమే నిరీక్షించింది. ఈ మ్యాచ్‌లో మినర్వా అకాడమీ యువ ఆటగాళ్లు 6-0 తేడాతో సెలబ్రిటీ జట్టుపై ఘన విజయం సాధించారు.అభిమానుల నిరీక్షణ ఫలించింది. లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్‌తో కలిసి మెస్సీ మైదానంలోకి అడుగుపెట్టగానే స్టేడియం మొత్తం దద్దరిల్లింది. దాదాపు అరగంట పాటు మైదానంలో గడిపిన మెస్సీ, యువ ఆటగాళ్లతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడాడు. అభిమానులతో ఫొటోలు దిగుతూ, బంతులను స్టాండ్స్‌లోకి కిక్ కొడుతూ వారిని ఉత్సాహపరిచాడు. ఈ కార్యక్రమంలో భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భుటియా కూడా పాల్గొన్నాడు.అనంతరం మెస్సీ ఐసీసీ ఛైర్మన్ జై షా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, డీడీసీఏ అధ్యక్షుడు రోహన్ జైట్లీలను కలిశాడు. ఈ సందర్భంగా జై షా భారత క్రికెట్ జట్టు జెర్సీని, ప్రత్యేకంగా సంతకం చేసిన బ్యాట్‌ను మెస్సీకి బహూకరించారు. రాబోయే టీ20 ప్రపంచకప్‌కు సంబంధించిన టికెట్‌ను కూడా అందజేశారు.చివరగా అభిమానులను ఉద్దేశించి మెస్సీ మాట్లాడాడు. "ఈ కొన్ని రోజులుగా భారత్‌లో మీరు
చూపించిన ప్రేమకు ధన్యవాదాలు. ఇది మాకు ఒక అద్భుతమైన అనుభవం. ఈ పర్యటన చాలా తక్కువ సమయం జరిగినా, మీ ప్రేమను ప్రత్యక్షంగా చూడటం నమ్మశక్యంగా లేదు. తప్పకుండా ఏదో ఒక రోజు తిరిగి వస్తాం. బహుశా ఒక మ్యాచ్ ఆడటానికి లేదా మరో సందర్భంలోనైనా సరే, మళ్లీ వస్తాం" అంటూ అభిమానులకు హామీ ఇచ్చాడు. ప్రయాణంలో ఆలస్యం కారణంగా మెస్సీ స్టేడియంలో తక్కువ సమయం గడిపినప్పటికీ, ఆ కొద్దిసేపటికే అభిమానులను ఆనందంలో ముంచెత్తి తన పర్యటనను చిరస్మరణీయం చేశాడు.

# ఏపీలో హార్ట్‌ఫుల్‌నెస్ విస్తరణ.. దాజీతో సమాలోచనలు జరిపిన సీఎం

- మొదటి పేజి తరువాయిఈ భేటీలో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ కార్యాలయాన్ని ఏర్పాటు చేసే విషయంపై చంద్రబాబు దాజీతో సమాలోచనలు జరిపారు. కన్హా శాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ చేపడుతున్న కార్యక్రమాల గురించి దాజీ సీఎంకు వివరించారు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణం, సుస్థిర వ్యవసాయం, ధ్యానం, యోగా శిక్షణ వంటి అంశాలపై జరుగుతున్న కృషిని ఆయన చంద్రబాబుకు తెలిపారు. శాంతి వనంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.
శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో 1400 ఎకరాల విస్తీర్ణంలో శ్రీరామచంద్ర మిషన్ ఈ శాంతి వనాన్ని అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్‌గా ఇది గుర్తింపు పొందింది. 8 లక్షలకు పైగా వృక్ష జాతులతో జీవవైవిధ్య కేంద్రంగా పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఇక్కడి హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్?స్టిట్యూట్ ఆఫ్ లీడర్‌షిప్ ద్వారా 'కౌశలం' పేరుతో యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.

# ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు..
# 100 విమానాల రద్దు

- మొదటి పేజి తరువాయి
రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం, ఇవాళ ఉదయం 6 గంటలకు ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ 456గా నమోదైంది. ఇది ఈ సీజన్‌లోనే రెండో అత్యంత గరిష్ఠ స్థాయి. ఆదివారం ఏక్యూఐ 461గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అక్షర్‌ధామ్ వద్ద ఏక్యూఐ 493గా, బారాఖంబా రోడ్డులో 474గా నమోదైంది.కాలుష్యం కారణంగా ఏర్పడిన పొగమంచుతో ఢిల్లీ విమానాశ్రయంలో సుమారు 100 విమానాలు రద్దు కాగా, 300కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు 90కి పైగా రైళ్లు 6 నుంచి 7 గంటల పాటు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి సంస్థలు ప్రయాణికులకు ప్రత్యేక సూచనలు జారీ చేశాయి. ప్రయాణానికి ముందు తమ విమాన సర్వీసుల వివరాలు తెలుసుకోవాలని కోరాయి.పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) కింద అత్యంత కఠినమైన స్టేజ్-IV ఆంక్షలను అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో అన్ని రకాల నిర్మాణ, కూల్చివేత పనులపై నిషేధం విధించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో
50 శాతం సిబ్బందికి వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు జారీ అయ్యాయి. 10వ తరగతి మినహా మిగిలిన తరగతులకు హైబ్రిడ్ విధానంలో క్లాసులు నిర్వహించాలని పాఠశాలలను ఆదేశించారు. మరోవైపు భారత వాతావరణ శాఖ (IMD) ఢిల్లీకి 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది.

# పోలీసులతో వైసీపీ నేత సీదిరి అప్పలరాజు వాగ్వాదం



రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ వైసీపీ చేపట్టిన కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజుకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ ఘటనతో 'కోటి సంతకాల' కార్యక్రమం రసాభాసగా మారింది.వివరాల్లోకి వెళితే.. పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ శ్రీకాకుళంలో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి హాజరయ్యేందుకు మాజీ మంత్రి అప్పలరాజు పలాస నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. ఈ ర్యాలీ వజ్రపుకొత్తూరు మండలం బెండి గేట్ వద్దకు చేరుకోగానే జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, మాజీ మంత్రి అప్పలరాజుకు మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఒకరిపై ఒకరు తీవ్ర స్వరంతో మాట్లాడుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు అడ్డుకోవడం ఏమిటని అప్పలరాజు ప్రశ్నించారు. ఈ వాగ్వాదంతో 'కోటి సంతకాల' కార్యక్రమం కొంతసేపు నిలిచిపోయింది.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

## ఏలూరులో అమ్మవారిని దర్శించికున్న హెూం మంత్రి అనిత



**ఏలూరు డిసెంబర్ 15 పెన్ పవర్:** ఏలూరు ప్రజల ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్న తూర్పు వీధి గంగానమ్మ జాతర సందర్భంగా రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత సోమవారం కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో నిర్వాహకులు హెూంమంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. జాతరలో భాగంగా మేడలపై కొలువుదీరిన శ్రీ కొర్లపాటి అంకమ్మ, శ్రీ గంగానమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ వినుకొండ అంకమ్మ, శ్రీ పోతురాజు బాబులను దర్శించుకొని సారెను సమర్పించారు. ఈ సందర్భంగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లతో కలిసి అమ్మవారికి చీరను కానుకగా సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్టీసీ రీజినల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కౌశిక్ వంతెనకు ముప్పు - మూడు నియోజకవర్గాల ప్రజలుకు తప్పని తిప్పలు

**కొత్తపేట, పెన్ పవర్, డిసెంబర్ 15:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట మండలం మోడేకుర్రు,అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామ శివారు వ్యాగ్రేశ్వరం రోడ్ లో ఉన్న కౌశిక్ వంతెన రైలింగ్,పిల్లర్స్,కాంక్రీటు ర్యాంప్ ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థలో పడిపోయి ప్రజలకు తీవ్రమైన ప్రమాదంగా మారింది. కొత్తపేట, అంబాజీపేట, పి.గన్నవరం ం ఈ మూడు మండలాలను కలుపుతూ సుమారుగా నాలుగు దశాబ్దాలుగా మూడు నియోజకవర్గాల ప్రజల రాకపోకలకు ఏకైక మార్గంగా నిలిచినది. ఇప్పుడు ఈ వంతెన దశాబ్ద కాలంగా నిర్లక్ష్యానికి గురై కూలిపోయే స్థితికి చేరింది.



సుమారు నాలుగుశతాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తున్న ఈ వంతెన ప్రస్తుతం బీటలు,తంబాలు చిట్లి, రైలింగ్ పూర్తిగా దెబ్బతిని, బేస్‌మెంట్ భాగం కుంగిపోవడంతో నిర్మాణ స్థిరత్వం పూర్తిగా కోల్పోయింది. కాంక్రీట్ స్తంభాలు బలహీనపడి, వంతెన కింద భాగం సిమ్మెంటు నేలరాలిపోవడంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. వంతెన దెబ్బతినడంతో ప్రజలు ప్రత్యామ్నాయంగా వంతెనకు పక్కనుంచి ప్రమాదకర మార్గంలో ప్రయాణం కొనసాగించాల్సి వస్తోంది. పిల్లలు, ఉద్యోగులు, రైతులు, వాహనదారులు ప్రతిరోజూ ఆందోళనతో ప్రయాణం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, సేవా వాహనాలు వెళ్లడం కూడా కష్టంగా మారింది. గత పది సంవత్సరాలుగా సమస్యను పలుమార్లు అధికారులుకు తెలిపినా, మూడు మండలాల అధికారుల నుంచి ఎటువంటి స్పష్టమైన చర్యలు జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు మండలాలకు కీలకమైన ఈ వంతెన పునర్నిర్మాణాన్ని అధికారులు సంయుక్తంగా చేపట్టి వెంటనే కొత్త బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడు కోవాలి: మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 16:**వెలుగుబంటి రామచంద్రారావు ఛారిటబుల్ ట్రస్ట్, శ్రీ షిర్డీసాయి విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు స్ఫూర్తిదాతల విగ్రహావిష్కరణ మహెూత్సవంలో ముఖ్య అతిథిగా మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు చేళ్లపిళ్ల వేంకట శాస్త్రి, దివాకర్ల శాస్త్రి, దువ్వూరు సుబ్బమ్మ విగ్రహాలను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకుందామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపు నిచ్చారు. ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరగాలన్న అంశానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా చేళ్లపిళ్ల వేంకట శాస్త్రి, దివాకర్ల శాస్త్రి, దువ్వూరు సుబ్బమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన దువ్వూరి సుబ్బమ్మ మనవరాలు దువ్వూరి రాజ్యలక్ష్మికి, నిర్వాహకులకు మంత్రి దుర్గేష్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వేంకట శాస్త్రి, దివాకర్ల శాస్త్రిల నాటకం కురుక్షేత్రాన్ని గుర్తుచేసుకున్నారు. గత ప్రభుత్వం తెలుగును విస్మరించిందని విమర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్యలో మాతృభాష విద్యా బోధన, త్రిభాష సూత్రం అవసరాన్ని వివరించారు. అన్ని భాషలకు ప్రాధాన్యతనిస్తూనే తెలుగు అగ్రతాంబూలం . చేళ్లపిళ్ల వేంకట శాస్త్రి, దివాకర్ల శాస్త్రి, దువ్వూరు సుబ్బమ్మ విగ్రహాలను పుష్కరాల సమయంలో గోదావరి గట్టు మీద ఏర్పాటు చేయాలని తెలుగు సాహితీ కార్యక్రమాలు, నిర్వహణ కమిటీ చైర్మన్, కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ చేసిన వినతి సముచిత మని కృషి చేస్తామన్నారు. ఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా లాంటి విభాగాన్ని రాజమండ్రిలో ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను అభ్యర్థించానన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో స్థలం సూచిస్తే అందులో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా విభాగం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. తెలుగుభాషను పెంచి పోషించినప్పుడే తిరుపతి వేంకట కవులకు ఘన నివాళి అర్పించిన వాళ్లమవుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మండలి బుద్ధ ప్రసాద్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, శ్రీమతి దువ్వూరి రాజ్యలక్ష్మి, తెలుగు సాహితీ కార్యక్రమాలు, నిర్వహణ కమిటీ చైర్మన్, కడియం ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ , హాస్యబ్రహ్మ శంకరనారాయణ, అవధానులు ధూళిపాల మహదేవ మణి, తాతా సందీప్ శర్మ, ఆకెళ్ళ బాలబాను తదితరులు పాల్గొన్నారు.

## కోటి సంతకాల సేకరణకు అపూర్వ స్పందన.

### మాజీమంత్రి వనిత

**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 15.** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతం అయిందని రాష్ట్ర మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్చార్జ్ తానేటి వనిత అన్నారు. నియోజకవర్గంలోని 4 మండలాల్లో సేకరించిన సంతకాల పేపర్లను సోమవారం జిల్లా ముఖ్య కేంద్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి తరలించారు. అక్కడనుండి వాటిని వాహనాలపై రాష్ట్ర పార్టీ కార్యాలయానికి తరలించినట్లు వనిత తెలిపారు. నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై తరలివచ్చారన్నారు. ఈ నాలుగు మండలాల్లో సేకరించిన 60 వేల సంతకాలను 1000 ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీగా రాజమహేంద్రవరం చేరుకున్నామన్నారు. అక్కడ మిగిలిన నియోజకవర్గాల నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించామన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటు పరిధిలోని వైయస్సార్ నాయకులు సేకరించిన సుమారు నాలుగున్నర లక్షల సంతకాల పేపర్లను రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయానికి తరలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 4 మండలాల కు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే



రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ ఇన్చార్జ్ తలారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.




## గొల్లపాలెంలో ఘనంగా 'రాజుల బిర్యానీ పాయింట్' గ్రాండ్ ఓపెనింగ్

### క్వాలిటీ ఫుడ్, ఆప్యాయతే లక్ష్యంగా రాజుల బిర్యానీ ు భోజన క్యాటరింగ్ సేవలు



**కాజులూరు, పెన్ పవర్ – డిసెంబర్ 15:**కాజులూరు మండల పరిధిలోని గొల్లపాలెం గ్రామంలో సాక్షి రెడ్డి కాంప్లెక్స్లో సోమవారం ఉదయం రాజుల బిర్యానీ పాయింట్ ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవానికి ముందు బ్రాహ్మణ అర్చకులచే పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం సలపాక గ్రామానికి చెందిన పబ్బినీడి సూరిబాబు చేతుల మీదుగా, పలువురు రాజకీయ నేతలు, బంధుమిత్రుల సమక్షంలో బిర్యానీ పాయింట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజుల బిర్యానీ పాయింట్ ప్రొప్రైటర్ సూరిబాబు మీడియాతో మాట్లాడుతూ, గొల్లపాలెంలో ప్రసిద్ధిగాంచిన గొల్లపాలెం బిర్యానీ రుచితో పాటు, రాజుల బిర్యానీ పేరుతో కాజులూరు, కరప మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించడమే తమ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. క్వాలిటీ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. రాజుల బిర్యానీతో పాటు మీల్స్ సదుపాయం, ప్రత్యేక కర్రీ పాయింట్ అందుబాటులో ఉందని, అలాగే వివాహాది శు భకార్యాలు, ఇతర వేడుకలకు భోజన క్యాటరింగ్ సేవలు తమ ప్రత్యేకత అని వివరించారు. ఆప్యాయతతో కూడిన భోజన వడ్డన, రుచికరమైన వంటకాలు అందించడం ద్వారానే కస్టమర్ల మనసు గెలుచుకోవాలన్నదే తమ ధ్యేయమన్నారు. క్యాటరింగ్ విభాగంలో నాణ్యమైన ఆహారంతో పాటు చెప్పిన సమయానికి సేవలు అందించడం తమ నిబద్ధత అని తెలిపారు. హెూటల్, క్యాటరింగ్ రంగంలో దశాబ్ద కాలానికి పైగా అనుభవం ఉందని, కస్టమర్లను ఆప్యాయంగా పలకరించడమే వ్యాపార విజయానికి మూలమని పేర్కొన్నారు. ఏ వ్యాపారం అభివృద్ధి చెందాలన్నా కస్టమర్ల ఆశీస్సులే ముఖ్యమని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూటమి నాయకులు చుండ్రు వీర్రాజు చౌదరి,శలపాక నీటి సంఘం అధ్యక్షులు తాడి రామారెడ్డి (టీఎంఆర్),చుండ్రు రుద్రరావు చౌదరి,మాజీ నీటి సంఘం అధ్యక్షులు మాధవరపు చలపతిరావు (దొరబాబు),దేగల సత్యనారాయణ మూర్తి (వైన్ షాప్),సూరంపూడి భాను,సబ్బినీడి శ్రీనివాసరావు చౌదరి, దేగల సతీష్,కావిరెడ్డి ఈశ్వరరావు, మాధవరపు చినబాబు,జక్కన సత్యనారాయణ,సలపాక గ్రామ సర్పంచ్ పోతుల గనిరాజు,టీడీపీ నాయకులు పోతురాజు భీమారావుతో పాటు పలువురు గ్రామస్థులు,అభిమానులు పాల్గొన్నారు. మరింత సమాచారం కోసం ప్రొ" సూరిబాబు సెల్ నెంబర్ 9115511226 సంప్రదించగలరు.

## విద్యుత్తు ఆదా చేయడమే విద్యుత్తు ఉత్పత్తి చేసినట్లే



### జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ, పెన్ పవర్,డిసెంబర్ 15:**సహజ ఇంధన వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పిలుపు నిచ్చారు. విద్యుత్తు ఆదా చేయడం అంటే కొత్తగా విద్యుత్తు ఉత్పత్తి చేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. జిల్లా విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో విద్యుత్తు ఉద్యోగులు, విద్యార్థు లతో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను విద్యుత్తు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ అవగాహన ర్యాలీ కలెక్టర్ కార్యాలయం నుంచి బాలాజీ చెరువు సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం ఇంధన పరిరక్షణ, సంరక్షణపై ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగం, ఇంధన పొదుపు అంశాలపై అన్ని వర్గాల ప్రజల్లో విస్తృత అవగాహన అవసరమన్నారు. జిల్లాలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని,స్టార్ రేటెడ్ ఎల్ఈడీ బల్బులు, నాణ్యమైన విద్యుత్ పరికరాల వినియోగం ద్వారా గణనీయంగా విద్యుత్తు ఆదా చేయవచ్చని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ ఆదా చేసే విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా విద్యుత్ పర్యవేక్షక ఇంజనీర్ జి. ప్రసాదరావు, వివిధ ప్రాంతాల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, విద్యుత్ అధికారులు, విద్యార్థులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏజెన్సీలో ప్రతి ఇంట్లో కరెంట్ ఆదా చేయాలి - ఐటిడిఏ పీఓ స్మరణ్ రాజ్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్ 15:**ఏజెన్సీ ప్రాంతాల్లో భావితరాలకు భరోసా కల్పించే విధంగా ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో కరెంట్ ఆదా చేయాలని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బచ్చు స్మరణ్ రాజ్ పిలుపునిచ్చారు.సోమవారం స్థానిక ఐటిడిఏ కార్యాలయ ప్రాంగణంలో ఇంధన పరిరక్షణపై అవగాహన కల్పించే ర్యాలీని ఐటిడిఏ పీఓ స్మరణ్ రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీలో ప్రతి గ్రామంలో కరెంట్ ఆదా చేసినట్లయితే రానున్న తరాలకు భరోసా ఇవ్వగలమని తెలిపారు. కరెంటు పొదుపుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, "నేటి సత్సంకల్పం – రేపటి వెలుగుల సాకారం" అనే కార్యక్రమం ద్వారా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు.ప్రతి ఇంట్లో అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు స్విచ్ ఆఫ్ చేయాలని, ఇస్త్రీ పెట్టెలు, ఎయిర్ కూలర్లు వంటివి జాగ్రత్తగా వినియోగించాలని అన్నారు. ఇకపై ఫ్రిజ్లు కొనుగోలు చేసే వారు ఆటోమెటిక్ ఫ్రిజ్లను ఎంచుకుంటే కరెంట్ ఆదాతో పాటు బిల్లులు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేయాలని సూచించారు.ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, ఇంధన శాఖ ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18న రంపచోడవరం అంబేద్కర్ సెంటర్లో కళాజాత కార్యక్రమం, కొన్ని ఇంటర్మీడియట్ కాలేజీల్లో ఈపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో కరెంట్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పాఠశాల విద్యార్థులతో డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు.అనంతరం ఐటిడిఏ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ఈపీఈపీడీసీఎల్ సుమారు 200 మంది సిబ్బందితో కరెంటు పొదుపు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డీఎన్వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీఓ బి.సత్యనారాయణ, ఏపీ ఈపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవీ రమణ, డీఈ మల్లికార్జునరావు, ఏఈలు శ్రీనివాసరావు, ఎన్.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు అందజేసిన టీం మణికర్ణిక



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 15 :** మండలంలో రాజపూడి గ్రామానికి చెందిన సమ్మెట ప్రసాద్ అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలిసిన మణికర్ణిక టీమ్ సభ్యులు ప్రసాద్ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా మణికర్ణిక టీమ్ సభ్యుడు పత్తిగుళ్ళ దుర్గా ప్రసాద్ ముందుకు వచ్చి ఒక నెలకు సరిపడా కిరాణా సరుకులు మరియు 26 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సహాయం వల్ల కుటుంబానికి కొంత ఊరట కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మణికర్ణిక టీమ్ సభ్యులు గున్నాబత్తుల వీరబాబు, పులిగ రమేష్, కమ్మిల సతీష్‌తో పాటు ఇతర సభ్యులు పాల్గొని తమ సహకారాన్ని అందించారు. సమాజంలో అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని మణికర్ణిక టీమ్ సభ్యులు ఈ సందర్భంగా వెల్లడించారు. మణికర్ణిక టీమ్ చేపడుతున్న మానవతా సేవా కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు.

## పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి




**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 15**: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు హాజరై పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్త కొండబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని భాష ప్రయుక్త రాష్ట్రాల కోసం పాటుపడిన వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## ఓజుబంద నల్లరాయి క్వారీలు మూసివేయాలి

* ఆదివాసి సంక్షేమ పరిషత్




**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్ 15:** గంగవరం మండలం ఓజుబంద గ్రామ పరిధిలో ఉన్న నల్లరాయి క్వారీలను తక్షణమే మూసివేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది. సోమవారం ఐటిడిఏ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, క్వారీల వల్ల ఆదివాసులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఐటిడిఏ పీఓ, సబ్ కలెక్టర్‌లకు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.గ్రామ ప్రజల అనుమతి లేకుండా కొత్త క్వారీలు ప్రారంభించడంతో పర్యావరణ కాలుష్యం, ఇళ్లకు నష్టం, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. దిరిసినపల్లి గ్రామ బహిష్కరణ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు జరిపి కేసులు నమోదు చేయాలని, అలాగే ఆదివాసులను రెచ్చగొట్టిన రంపచోడవరం ఎమ్మార్వో, మైనింగ్ ఏడీ పాడేరు వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.అక్రమ మైనింగ్‌పై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను హెచ్చరించారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి ఘనంగా నిర్వహణ



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 15:**అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ ఆధ్వర్యంలో ఆంధ్ర అవతార పురుషుడైన పొట్టి శ్రీరాములు కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపిడిఓ వెంకట రామన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకట రామన్ మాట్లాడుతూ, తెలుగు ప్రజల ఆత్మగౌరవం, స్వీయ పరిపాలన ఆకాంక్ష కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన చేసిన త్యాగం వల్లనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఆయన త్యాగం భారత దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడినదని అన్నారు.

ఈ నివాళుల కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పి.వి. ప్రసాదరావు, డిప్యూటీ ఎంపిడిఓ పి.వి.ఆర్.కె. రాజు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామ స్వరూప్, గ్రామ సచివాలయ డిప్యూటీ ఎంపిడిఓ కె. రమేష్ బాబు, ఏపిఎం ఆర్.యం.డి. గంగాధర్‌తో పాటు మండల పరిషత్ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది పాల్గొని అమరజీవికి ఘన నివాళులు అర్పించారు.

## ఏజెన్సీ మారుమూల గ్రామాల సమస్యలపై తక్షణ చర్యలు - ఐటిడిఏ పీఓ స్మరణ్ రాజ్



**రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్ 15:**
ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలు, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి, వీలైన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తూ, మిగిలిన సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించి సంబంధిత అధికారులకు పంపుతున్నట్లు రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ తెలిపారు.సోమవారం రంపచోడవరం ఐటిడిఏ సమావేశపు హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐటిడిఏ పీఓ స్మరణ్ రాజ్‌తో పాటు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నోకాల్, సబ్ కలెక్టర్ సాహిత్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఏపీఓ జనరల్ డిఎన్వి రమణ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా స్మరణ్ రాజ్ మాట్లాడుతూ, ఈ వారం మొత్తం 86 దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించి, దరఖాస్తుదారుల అర్హతలను బట్టి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎడీఏలు సావిత్రి, రామ్మోహన్, పిహెచ్ఓ దేవదానం, జిసిసి డిఎం జయశ్రీ, పిఏఓ ఎల్.రాంబాబు, అదనపు డిఎం %డ% హెచ్ ఓ డాక్టర్ సరిత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సుబ్బయ్య, బి.వి.రమణ, తహసిల్దార్ పి.బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, సిడిపివోలు క్రాంతికుమారి, ప్రత్యక్ష లక్ష్మి, కె.ఉమా, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు త్యాగాన్ని తెలుగు ప్రజలంతా స్మరించుకోవాలి

* ఐటీడీఏ పీఓ స్మరణ్ రాజ్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్ 15:**తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ప్రతి తెలుగు వాడూ గుర్తుపెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ అన్నారు.సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి రంపచోడవరం ఐటీడీఏ పీఓ స్మరణ్ రాజ్, చింతూరు ఐటీడీఏ పీఓ శుభం నొక్వాల్, ఏపీఓ జనరల్ డీఎన్వీ రమణతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా స్మరణ్ రాజ్ మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న నెల్లూరు జిల్లా పడమటి పల్లి గ్రామంలో జన్మించారని తెలిపారు. తెలుగు ప్రజల కోసం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన లక్ష్యంగా 1952 అక్టోబర్ 19న మద్రాసులో బులుసు సాంబమూర్తి నివాసం నుండి ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించి, 1952 డిసెంబర్ 15న ప్రాణాలర్పించారని గుర్తుచేశారు.చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకంగా పాల్గొన్నారని తెలిపారు. 1930 ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంతో పాటు 1941 – 42 మధ్య జరిగిన స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొని జైలు శిక్షలు అనుభవించారని చెప్పారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన ద్వారా తెలుగు ప్రజలకు చిరస్మరణీయ సేవ చేసిన మహనీయుడిగా పొట్టి శ్రీరాములు చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎడీఏలు సావిత్రి, రామ్మోహన్, పిహెచ్ఓ దేవదానం, జిసిసి డీఎం జయశ్రీ, పీఏఓ ఎల్. రాంబాబు, అదనపు డీఎం %డ% హెచ్ ఓ డా. సరిత, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సుబ్బయ్య, బీవీ రమణ, తహసిల్దార్ పి. బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, సిడిపిఓలు క్రాంతి కుమారి, ప్రత్యక్ష లక్ష్మి, కె. ఉమా, ఇతర అధికారులు, వైద్యులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్న వస్త్ర వైద్య విద్యా దాన సమాజం వార్షికోత్సవం



**ఏలూరుడిసెంబర్ 15 పెన్ పవర్:** ఏలూరు నగరంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన స్థానిక కుండి సెంటర్‌లో అన్న వస్త్ర వైద్య విద్యా దాన సమాజం వార్షికోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరార్థులకు సేవలందించే విషయంలో అన్న వస్త్ర వైద్య విద్యా దాన సమాజం కృషి చేయాలన్నారు ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం, దుప్పట్లు పంపిణీ, అన్నసమారాధనను నిర్వహించారు.అన్న వస్త్ర, విద్యార్థులకు భోజన వసతి కల్పించడం, సమాజం ఆస్తులను కాపాడుతూ దానిపై వచ్చే ఆదాయంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోన్న అన్న వస్త్ర వైద్య విద్యా దాన సమాజం సభ్యులను అభినందించారు. గత ప్రభుత్వం దేవాదాయ శాఖను నిర్వీర్యం చేసేసిందని,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని దేవాదాయ శాఖా ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక పర్యవేక్షణకు చర్యలు తీసుకుందన్నారు. సమాజం సభ్యులు కూడా, అంతే బాధ్యతతో వ్యవహరిస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను ,నిర్వహించాలని ఆయన సూచించారు. సమాజంలో అన్నదానం అన్నదానం స్వీకరించే వారికి తగిన సౌకర్యాలు సమకూర్చాలని,కార్యనిర్వహణాధికారి, అన్నదాన సమాజం కమిటీ సభ్యులకు కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈవో పెన్మెత్స వెంకట కృష్ణంరాజు, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, డివిజన్ ఇంచార్జ్ బచ్చు మురళీ, నాయకులు తవ్వా అరుణకుమారి, ఆర్నేపల్లి తిరుపతి, చోడే బాలు, మాజీ చైర్మన్ పూజారి నిరంజన్,తూతా శ్రీనివాస్, చింతా వెంకట దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకుడు పడాల చంటిబాబు



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 15**: జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామంలో పడాల చంటిబాబు 7వ వర్ధంతిని ఆయన వారసులు భగవాన్, బాలాజీ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు ఫ్రూట్స్, పలహారాలు, అందించి దుప్పట్లు పంచిపెట్టారు. రింగ్ రోడ్ లో పడాల చంటిబాబు అందరికి సుపరిచితుడేనని, ప్రజలలోనుంచి వచ్చిన నాయకుడు అనునిత్యం ప్రజల కోసం నిరంతరం పాటు పడే వ్యక్తి పడాల చంటిబాబు అని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పడాల రాంబాబు (బాబ్జి), పోలం సత్యనారాయణ, పొలం పద్దరాజు, పడాల పెద్ద రాజబ్బాయి, బాదం వెంకటకృష్ణ, బొదిరెడ్డి అబ్బాయి, అడ్డాల బూరయ్య, అబ్బిరెడ్డి వీరబాబు, పడాల విష్ణుమూర్తి, పడాల దుర్గాప్రసాద్,అడబాల భీమ, మరోతి కృష్ణ, కట్టమూరి పరమేష్, కట్టమూరి రామకృష్ణ, పడాల నాగేష్, యర్ర పరమేశ్వరరావు, పోంద్రు బాలనాగు, గండికోట రామస్వామి, నక్కా అప్పలరాజు, ఇజ్జిన సతీస్, తాతపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్ లో పేదలకు అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, డిసెంబర్ 15 :** ప్రతి సోమవారం జగ్గంపేట ఎన్టీఆర్ విగ్రహం వద్ద జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో గత నాలుగున్నర సంవత్సరాలుగా ఉచిత అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 16వ తేదీన జగ్గంపేట టీడీపీ మండల అధ్యక్షులు, జేవిఆర్ గ్రూప్స్ అధినేత జీను మణిబాబు పుట్టినరోజు సందర్భంగా ఆయనకు అడ్వాన్స్ జన్మ దిన శుభాకాంక్షలతో జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థల చైర్మన్ బండారు నాగబాబు, డైరెక్టర్ శ్వేత దంపతుల ఆర్థిక సహాయంతో ఈ వారం అన్న క్యాంటీన్ లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మూర్తి, పాండ్రంకి రాంబాబు, పీల మహేష్, రాయి సాయి, యల్లమిల్లి సీఎం, దాపర్తి సీతారామయ్య, దేగల సత్తిబాబు, బద్ది సురేష్, నలమాటి ఆనంద్, కోడూరి రమేష్ , చేలికాని హరిగోపాల్, నాగిరెడ్డి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ను కలిసిన జంగా గౌతమ్

**అంబాజీపేట, పెన్ పవర్, డిసెంబరు15:**అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ను ఏఐసీసీ ఎస్సీ విభాగం జాతీయ కోఆర్డినేటర్ గా ఇటీవల నియమితులైన జంగా గౌతమ్ మర్యాదపూర్వకంగా కలిసారు.
ఆదివారం ఢిల్లీలో జరిగిన ఓటు చోరీ గద్దీ చోడ్ బహిరంగ సభ అనంతరం మల్లికార్జున ఖర్గే ను కలుసుకుని తనకు ఏఐసిసి ఎస్సి విభాగంలో జాతీయ కో ఆర్డినేటర్ గా నియమించినందుకు ఖర్గే కు జంగా గౌతమ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఖర్గే సూంచారని జంగా గౌతం తెలిపారు. కేంద్రంలోని బీజేపీ.. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పూర్తిగా తీసివేసేందుకు కుట్రలు చేస్తుందని.. కనుక కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో జరుగుతున్న రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంలో దళితులను భాగస్వామ్యం చేసేందుకు కృషి చేయాలని ఖర్గే చెప్పినట్టు జంగా గౌతమ్ ఒక ప్రకటన లో తెలిపారు.



# ఏలూరు ఎంపీ కార్యాలయంలో జాతీయ నేతలకు నివాళులు




**ఏలూరు డిసెంబర్ 15 పెన్ పవర్ :** ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయంలో మాజీ హోం మంత్రి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్,అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములుకుసోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్థానిక నేతలు కార్యాలయ సిబ్బంది పటేల్, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ మహానుభావులు దేశం కోసం చేసిన కృషిని, త్యాగాలను ప్రస్తుతించారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దేశ వ్యాప్తంగా ఉన్న వందలాది సంస్థానాలన్నిటినీ విలీనం చేసి దేశ సమైక్యతను కాపాడటంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి మరువలేనిదని వక్తలు కొనియాడారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని సంకల్పించి 58 రోజుల కఠోర నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ఈ సందర్భంగా నేతలు గుర్తుచేసుకున్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

# పల్లె నిద్ర కార్యక్రమంలో పోలీసులు




**జీలుగుమిల్లి, పెన్ పవర్, డిసెంబర్ 15:** యువత మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా ఉండేందుకు వాటి వల్ల కలిగే ఆరోగ్య పరమైన, సామాజిక పరమైన నష్టాలు ఉంటాయని జీలుగుమిల్లి సిఐ బి వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం రాత్రి రాచన్న గూడెం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులకు భద్రత చట్టపరమైన రక్షణలు, సైబర్ భద్రతపై వివరించమన్నారు. పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా రక్షణ కల్పించే ఒక్కో చట్టంలోని నిబంధనలు తల్లిదండ్రులకు వివరించారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలు, ఓటీపీ మోసాలు గురించి వివరించి సైబర్ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వి క్రాంతి కుమార్, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం




**జీలుగుమిల్లి, పెన్ పవర్, డిసెంబర్ 15:** మండలం లో అంకన్న గూడెం,రాచన్నగూడెం, గ్రామాల్లో సోమవారం పల్లెపల్లికి మన ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొన్న పోలవరం శాసనసభ్యులు చిర్రీ బాలరాజు, ప్రజల యొక్క సమస్యలు తెలుసుకుని అధికారులకు తెలియజేసి వెంటనే సమస్యలు పరిష్కరించుచున్నారు.నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పూర్తిగా పరిష్కరించడమే తమ ప్రధాన కర్తవ్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై గ్రామస్థాయిలోని సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలనే ఉద్దేశంతో కొత్త కార్యక్రమంగా 'పల్లె పల్లెకి అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.
అంకన్నగూడెం గ్రామంలో 70లక్షలు వ్యయంతో సిసి రోడ్లు నిర్మాణం పూర్తయింది.అదనంగా 50లక్షలు మంజూరు చెసిన మిగిలిన సిసి రోడ్లు కూడా పూర్తి చేయాలని తెలిపారు. త్వరలో అర్హులందరికీ నూతన సంవత్సరంలోఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్ ,ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, జీలుగుమిల్లి సొసైటీ చైర్ పర్సన్ సరిపల్లి సత్యనారాయణ రాజు, పదం వెంకటకృష్ణ, గోపి, అంకన్న గూడెం పంచాయితీ కార్యదర్శి కె అరుణ జ్యోతి, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, కుటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు వర్ధంతి ఘనంగా నిర్వహణ...

* మోటమర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో



**కాట్రేనికోన పెన్ పవర్ డిసెంబర్ 15 :**కాట్రేనికోన గ్రామం లో భాష ప్రయోక్త రాష్ట్రాల కోసం ప్రాణత్యాగం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ సాధించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వారి 73వ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘ సభ్యులు మరియు కూటమి నాయకులు పొట్టి శ్రీరాములు వారి కి పూలమాలలు వేసి నివాళులు అర్పించి నారు ఈ కార్యక్రమంలో పాల్గొనిన వారు మోటమర్రి రామ సత్యనారాయణ , చెరుకు రామలింగేశ్వరరావు బిజెపి జిల్లా ట్రెజరర్
గ్రంధి నానాజీ తెలుగుదేశం నాయకులు కంచర్ల కృష్ణ ,మోటమర్రి ఉదయ భాస్కర్ రావు ,ఆదినారాయణ, పాల్గొన్నారు...

# కోనసీమ నుంచి కోటి సంతకాల ప్రతులు తాడేపల్లికి

* జై జగన్ నినాదాలతో దద్దరిల్లిన జిల్లా



**రావులపాలెం పెన్ పవర్ డిసెంబర్ 15:**మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల తో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఘనంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల ప్రతులను జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి జెండా ఊపి తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి పంపించారు.
ఈ సందర్భంగా జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీకి వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 'జై జగన్ %-% జై జగన్' నినాదాలతో కోనసీమ జిల్లా మార్మోగగా, ప్రజా వ్యతిరేక విధానాలపై తమ నిరసనను ప్రజలు గళమెత్తారు.
ప్రభుత్వం తీసుకుంటున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వైఎస్ఆర్సీపీ నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య విద్యా సంస్థలను విస్తరించిందని, వాటిని ప్రైవేటీకరణ వైపు నెట్టడం తగదని వారు హితవు పలికారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

# ఆత్రేయపురంలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై అవగాహన సమావేశం



* ప్రతి కుటుంబం సర్వేలో పాల్గొనాలి : ఎంపిడిఓ వెంకట రామన్

**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 15:**ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే నిర్వహణపై పంచాయితీ కార్యదర్శులు, సంక్షేమ విద్యా సహాయకులతో కలిసి సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ అధ్యక్షత వహించారు.
ఈ సందర్భంగా ఎంపిడిఓ వెంకట రామన్ మాట్లాడుతూ, మండలవ్యాప్తంగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను 15-12-2025 నుంచి 12-01-2026 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వేను నిర్ణీత గడువులో విజయవంతంగా పూర్తిచేయడానికి సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సర్వేలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు.
గ్రామ/వార్డు సచివాలయాల ప్రత్యేక డిప్యూటీ ఎంపిడిఓ కె. రమేష్ బాబు మాట్లాడుతూ, ఈ సర్వే ఆధారంగా ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు జారీ చేయబడుతుందని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలు, సేవలు ఈ కార్డు ఆధారంగానే అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. అందువల్ల ప్రతి కుటుంబం తప్పనిసరిగా సర్వేలో పాల్గొనేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఓ పి.వి.ఆర్.కె. రాజు, మండలంలోని అన్ని పంచాయితీ కార్యదర్శులు, సంక్షేమ విద్యా సహాయకులు పాల్గొని సర్వే నిర్వహణపై పలు అంశాలపై చర్చించారు.

# అమరావతి రాజధాని ముసుగులో దేశంలోనే భారీ భూ దోపిడి

* భవిష్యత్ లో భూసమీకరణ లో కేసులు, జైళ్ళు తప్పావా ?
* రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ మేడా శ్రీనివాస్ ఆవేదన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 15:**అమరావతి రాజధాని కేంద్రంగా జరుగుతున్న భూ దోపిడి యావత్ దేశం లోనే అతి పెద్ద కుంబకోణంగా చరిత్రలో నిలిచి పోతుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సందేహం వ్యక్త పరిచారు.
అమరావతి రాజధాని పేరుతో ఇప్పటికే సుమారు 33 వేల ఎకరాల పైబడిన భూమిని రైతుల నుండి బలవంతంగా సమీకరించారని తెలిపారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన సభలో అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ, భవిష్యత్ లో వచ్చే ప్రభుత్వాలు అమరావతి కేంద్రంగా జరిపిన భూ సమీకరణకు బాధ్యులైన ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు జైలుకు వెళ్ళాల్సిన పరిస్థితులు తప్పవన్నారు. దేశంలో ఇంతవరకు జరిగిన కుంబకోణాలు అమరావతి భూ కుంబకోణం ముందు చిన్నవన్నారు.
పూర్తిగా రాజధాని నిర్మాణం జరిగే సమయానికి ఏ ఒక్క రైతు వద్ద సొంత భూమి లేకుండా చేయటమే అమరావతి భూ కుంబకోణమని, ప్రభుత్వాన్ని నమ్మి భూములు ఇచ్చిన రైతులకు నేడు ప్రభుత్వం నుండి ఖచ్చితమైన భరోసా లేదన్నారు. బ్యాంకులు ఋణాలు సైతం ఇవ్వటం లేదని, రైతుల బిడ్డల చదువులకు ఆర్థిక ఇబ్బందులతో , బిడ్డల భవిష్యత్ తెలియక రైతులు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. రైతుల నుండి భూములు తీసుకుని సుమారు 10 ఏళ్ల కావొస్తుందని, ఆ భూములపై రైతుల హోక్కులను ఆవిరిని చేసేసారన్నారు.
రాష్ట్రంలో సుమారు 6 కోట్ల మంది జనాభా వుంటే అప్పులు లక్షల కోట్లల్లో వున్నాయని, అప్పులకు తగిన అభివృద్ధి ఆంధ్రప్రదేశ్ లో కనపడక పోవటం విచారకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ లో భూమి, మద్యం, ఇసుక, గంజాయి మత్తు ప్రదార్థాలు, పాలనాధికార దుర్వినియో గంతో బలపడుతున్నాయని విమర్శించారు. చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ కు రాజధాని అమరావతి అని ప్రచారం చేస్తున్నరని, కేంద్రంకు, అమరావతి రాజధాని కి సంబంధం లేదని అదొక మోసమన్నారు. అప్పులు ఆంధ్రుల భవిష్యత్ కు శాపంగా మారుతు న్నాయని, అభివృద్ధి శున్యంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేసారు. ఆంధ్ర మహాసభ - జై ఆంధ్ర ఉద్యమ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ నిర్మాణాన్ని సాధించుకుందామని
పిలుపు నిచ్చారు. ఈ ఉద్యమ నిర్మాణంలో రైతులు, యువత, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు , పట్టభద్రులు పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు.
ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి వి రమణమూర్తి, దుడ్డే త్రినాద్ , సిమ్మా దుర్గారావు , దుడ్డే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్, కారుమూరి యుగంధర్ , గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , జ్యోతిష్ , చల్లా సాంబశివరావు , వల్లి శ్రీనివాసరావు, యర్రా బాల మురళి కృష్ణ , రంగారావు , లంక వీర వెంకట సత్యనారాయణ , అడపా శేషగిరి , తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు పుల్లేటికుర్రు విద్యార్థులు



**అంబాజీపేట, పెన్ పవర్, డిసెంబరు 15:**రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పుల్లేటికుర్రు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు
ఎంపిక అయినట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయులు బీర ధర్మరాజు (ఎఫ్.ఎ.సి.) తెలిపారు. ఈనెల 14వ తేదీన కాకివాడ
డి.ఎస్.ఎ. స్టేడియంలో జరిగిన అండర్-18 జూనియర్స్ ఖో-ఖో ఎంపికలలో పాల్గొన్న మర్రి
తేజస్వి, చీకిరిమిల్లి హర్ష వర్ధినిలు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ నెల19 వ తేదీ నుండి ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పాటలలో పాల్గొంటారు. అలాగే పాఠశాలకు చెందిన చీకిరి మల్లి హర్ష వర్ధి ని 14వతేదీ రావులపాలెం లో జరిగిన జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అండర్-16 విభాగంలో 2 కిలోమీటర్ల పరుగులో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి
పోటీలలో పాల్గొంటుంది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుల అందే సూర్యనారాయణ, దొమ్మేటి ఉదయ భాస్కర్లను సర్పంచ్ జల్లి బాలరాజు, పి.ఎమ్. సి కమిటీ చైర్ పర్సన్ ఎన్.
రత్నం, ఎమ్ పిటిసి లు వడలి కృష్ణ మూర్తి, పబ్బినీడి రాంబాబు, కుసుమ వెంకటేష్, స్టాప్ సెక్రటరీ జి.వి.రాము, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు అజరామరం

కమిషనర్ రాహుల్ మీనా




**రాజమహేంద్రవరం, పెన్ పవర్ డిసెంబర్ 15**
ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను సైతం అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు అజరామరమని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ నందు సోమవారం జరిగిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆ అమరజీవి సేవలను స్మరించుకున్నారు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి అశువులు బాసిన పోరాట యోధుడని కొనియాడారు. అనుకున్నది సాధించాలనే పట్టుదల, కార్యదీక్ష, నిబద్ధత, క్రమశిక్షణలో పొట్టి శ్రీరాములుదే అగ్రస్థానమని అన్నారు. ఆయన సాధారణ కుటుంబంలో జన్మించినప్పటికీ గాంధీ మహాత్ముడి సిద్ధాంతాలకు ప్రభావితుడై సబర్మతీ ఆశ్రమానికి వెళ్ళి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారన్నారు. ఉప్పు సత్యాగ్రం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని జైలు జీవితాన్ని కూడా అనుభవించారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో మంచి సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగే శ్వర్, సెక్రటరీ జి.శైలజవల్లి, ఎంహెచ్ఓ వినూత్న, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, ఈఈలు మదర్సా అలీ, మాధవి, డిప్యూటీ డైరక్టర్(అమృత్) రామారావు, మేనేజర్ ఎండి అబ్దుల్ మలిక్, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల ల 16 నుండి 20 వరకు ఉర్దూ వారోత్సవాలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ డిసెంబర్ 15**
స్టేట్ ఉర్దూ అకాడమీ ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటూ చేసి యాభై సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భం గా మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి జనాబ్ ఎన్. ఎండి. ఫరూక్ , ఉర్దూ అకాడమీ చైర్మన్ ఎండీ. ఫరూక్ షుబ్లి విజయవాడ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఉద్యోగులు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో ఉర్దూ వారోత్సవాలు ఈ నెల ల 16 నుండి 20 వరకు జరుగుతాయని విడుదల చేసిన బ్రోచర్ ను జిల్లా కలెక్టర్ కార్యాలయ స్పందన హాల్లో జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప సమక్షం లో డి ఆర్ ఓ, సీతారామమూర్తి కి బ్రోచర్ ద్వార తెలియజేసిన ఉర్దూ అకాడమీ ఉర్దూ ఫ్యాకల్టీ శ్రీమతి నస్రీన్ ఫాతిమా చిత్రం లో జైనులాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల ప్రచారం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 16:** బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ - తూర్పు గోదావరి జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో కడియం మండలం, కడియపులంక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం బాలల రక్షణ అధికారి జి. క్రాంతిలాల్ మాట్లాడుతూ, బాల్య వివాహ నిషేధ చట్టం -2006 ప్రకారం అమ్మాయికి 18 అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకముందే వివాహం చేయడం బాల్య వివాహమని తెలిపారు. బాల్య వివాహానికి సహకరించినా, ప్రయత్నించినా లేదా నిర్వహించినా చట్టం ప్రకారం రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించ బడతాయని స్పష్టం చేశారు.మంచి చదువుతో అభివృద్ధి చెందుతూ, వ్యక్తిగత భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తల్లిదండ్రులు గురువుల మాటలను గౌరవిస్తూ ముందుకు సాగాలని అన్నారు. మంచి స్పర్శ - చెడు స్పర్శ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరి స్పర్శతో అసహ్యంగా, ఇబ్బందిగా అనిపిస్తుందో అది చెడు స్పర్శ అని వివరించారు. బాలల శరీరంలోని రహస్య భాగాలను ప్రతి విద్యార్థి తన ఉజ్వల భవిష్యత్తును బంగారు బాటలో నిర్మించుకుని, జీవితంలో తలెత్తుకుని జీవించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం - 2012 (పోక్సో చట్టం) వివరించారు. బాలలపై వేధింపులు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ -1098, పోలీస్ - 100 / 112 నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. వ్యక్తిగత భద్రత లో బాలికలు ఒంటరిగా ఉండకూడదని, ప్రయాణాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మద్యం సేవించిన వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ ఎల్‌ఏడీసీ టి. మహేష్ మాట్లాడుతూ, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు న్యాయ సేవలను వినియోగించుకోవాలని, ఉచిత న్యాయ సహాయం కోసం 15100 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. జిల్లా కోఆర్డినేటర్, క్రాఫ్ ఆర్గనైజేషన్ బి. రాజ్‌కుమార్, మాట్లాడుతూ, బాలల హక్కులైన జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, పాల్గొనే హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. అసిస్టెంట్ ఎల్‌ఏడీసీ జి. ఉదయ్‌కుమార్ ఈ సందర్భంగా విద్యార్థులతో బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ పీఎల్‌వీలు వై. వెంకటేశ్వరరావు, ఎ. సూర్యచంద్రరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి ఆర్. హిమశైలజ, ప్రధానోపాధ్యాయులు కె. జయలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు మానవత ఆర్థిక సాయం



**తాళ్లపూడి, పెన్ పవర్, డిసెంబర్ 15:** రోడ్ యాక్సిడెంట్ లో మోకాలికి ఆపరేషన్ జరిగి, బెడ్ రెస్ట్ లో ఉంటూ కుటుంబ పోషణకు, మెడిసిన్, వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న నీలంశెట్టి బాలకృష్ణకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున 6 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేయడమైనదని సంస్థ కార్యదర్శి సనపల రాజశేఖర్ తెలిపారు. కష్టాల్లో ఉన్నవారి ఒక్క కన్నీటిబొట్టునైనా తుడవాలన్నదే మానవత ధ్యేయమని అన్నారు. సంస్థ అధిక మొత్తం విద్య, వైద్య సేవల కోసం ఖర్చు పెడుతుందని తెలిపారు. సంస్థ కోశాధికారి అప్పన వీర హనుమంతురావు మాట్లాడుతూ కష్టాల్లోనూ, ఆపదలోనూ ఉన్నవారు మానవతను ఆశ్రయిస్తే తగు సహాయం చేస్తామని అన్నారు. సంస్థ ఫౌండర్ రామచంద్రా రెడ్డి ఆశయాల మేరకు మానవులకు సేవ చేయడమే సంస్థ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెమ్మాడి దుర్గాప్రసాద్, తలారి రామ్మోహన్, అంకెం సురేష్, టి.ఎన్.బి గుప్తా, ధర్మాన రాము, తాడెల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అధికారుల వ్యక్తిగత బాధ్యత తప్పనిసరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 16:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు వ్యక్తిగత బాధ్యత వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి స్పష్టం చేశారు.

సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల సమస్యలకు పరిష్కార మార్గం చూపించడమే లక్ష్యంగా పనిచేస్తోందని, అనుగుణంగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి స్థాయి జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని సూచించారు.

అర్జీల పరిష్కారంపై ప్రజల అభిప్రాయాలను ఐవీఆర్ఎస్ ద్వారా రాష్ట్రస్థాయిలో సమీక్షిస్తున్నట్లు తెలిపారు. వివిధ శాఖల పనితీరును అంశాల ప్రాతిపదికన విశ్లేషణ చేసి, నిర్లక్ష్యం వహించినా లేదా సరైన సమాచారం ఇవ్వని అధికారులపై షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో 180 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. రెవెన్యూ శాఖ 86, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు 50, హోం శాఖకు 21, డి ఎల్ ఎస్ ఎ 2 , ఇతర శాఖలకు చెందిన 21 అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు.

చాగల్లు మండలం మార్కొండపాడు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి ధనలక్ష్మి, తమ్మిశెట్టి లక్ష్మణరావు సర్వే నంబర్లు 1743 మరియు 256లలో ఉన్న తమ వ్యవసాయ భూమి రీసర్వేలో తక్కువగా నమోదైందని, పలు మార్లు అర్జీలు ఇచ్చినా సరిగా నమోదు చేయడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై చాగల్లు తహసిల్దార్, మండల రీసర్వే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కాకినాడకు చెందిన తోట కృష్ణ తేజా తమ తల్లి తోట గౌరీదేవికి చెందిన గోకవరం మండలం గాదెలపాలెం గ్రామంలోని సర్వే నంబర్లు 343/3, 343/6ల భూమి తప్పుగా ఇతరుల పేరుపై నమోదు అయ్యిందని తెలిపారు. సంబంధిత పత్రాలు సమర్పించినందున ఈ విషయంపై న్యాయం చేయాలని కోరారు. ఈ అర్జీలపై తక్షణమే విచారణ జరిపి, నిబంధనల మేరకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ డి సి ఎస్ భాస్కర్ రెడ్డి, వి భాగ్యవతి, ఇంచార్జి డి డి వో పి వీణా దేవి, సి ఐ గణేష్ కుమార్, డీ ఐ పీఆర్వో కె లక్ష్మీ నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం లో 23 ఫిర్యాదులు స్వీకరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 16**

ప్రభుత్వం చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం", (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని సోమవారం తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకుని, నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చారు. నేటి పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" కార్యక్రమానికి 23 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల , చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు

## హిందూ దేవాలయాలు, దైవ కార్యక్రమాలకు మాత్రమే నా సహకారం.

- వ్యక్తిగత అవసరాలకు నన్ను సంప్రదించవద్దు.
- ప్రముఖ పారిశ్రామికవేత్త సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ.



**కిర్లంపూడి, పెన్ పవర్, డిసెంబర్ 15:** చిల్లంగి, జగపతినగరం, కిర్లంపూడి మూడు గ్రామాల మిత్రులకు, శ్రేయోభిలాషులకు, మూడు గ్రామాల ప్రజలకు ప్రముఖ పారిశ్రామికవేత్త, గొప్ప ఆధ్యాత్మికపరుడు సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ ముఖ్యమైన మనవి చేసారు. మన మూడు గ్రామాల్లో ఇకపై జరగబోవు హిందూదేవాలయాల అభివృద్ధి, దైవ కార్యక్రమాలకు నా సహాయ సహకారాలకు నన్ను మాత్రమే సంప్రదించాలన్నారు. వ్యక్తిగత అవసరాలకు నన్ను సంప్రదించవద్దని సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మూడు గ్రామాల్లో నా తరపున ఎవర్నీ నియమించలేదని, నా కార్యక్రమాలను నేను మాత్రమే చూసుకుంటున్నానని, కావున నన్ను మాత్రమే సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు. నన్ను ఎవరైనా సంప్రదించాలంటే ఒక నార్మల్ మెసేజ్ పెట్టండన్నారు. మెసేజ్ చూసి నాకు వీలుకుదిరిన సమయంలో ఫోన్ లో సంప్రదిస్తానని సంపర సుధాకర్ శ్రీ వినాయక వర్మ తెలిపారు. నాయందు దయవుంచి నన్ను అర్థం చేసుకుని ఫోన్ కాల్స్ గాని, వాట్సాప్ మెసేజ్ కానీ పెట్టవద్దని మరొక్కసారి విన్నవించారు. మరొక్కసారి చెబుతున్నాను నేను హిందూ,దైవ కార్యక్రమాలకు మాత్రమే నా వంతు సహకారం అందిస్తానని, వ్యక్తిగత అవసరాలకు నేను ఎటువంటి సహాయం చేయనని, నా తరపున మూడు గ్రామాల్లో ఎవరిని నియమించలేదని మరొక్క సారి తేట తెల్లం చేశారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని ఈ సందర్భంగా సుధాకర శ్రీ వినాయక వర్మ కోరారు

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేక్షన్ పై శిక్షణ



**వై రామవరం,పెన్ పవర్, డిసెంబర్ 15 :** మండలంలోని సచివాలయం సిబ్బందికి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేక్షన్ పై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు.

మండలంలో అన్ని సచివాలయాల పరిధిలో నేటి నుండి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేక్షన్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సాధారణ కుటుంబాల గురించి సమాచారాన్ని సేకరించడానికి నిర్వహించే సమగ్ర సర్వేక్షణ ఇది అని తెలిపారు. సామాజిక సంక్షేమం విధాన రూపకల్పన పరిపాలన ప్రయోజనాల కోసం ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. భారతదేశంలో ప్రభుత్వం లేదా పరిపాలన వర్గాలలో ఇది కుటుంబ జనాభా గణాంకాలు సామాజిక ఆర్థిక స్థితి ఆరోగ్యం విద్య ఇతర వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. ఈశ్వర ప్రసాద్ నెహ్రూ డిప్యూటీ ఎంపీడీవో, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

## రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ధర్మరాజు



**పెన్ పవర్, ఉంగుటూరు నవంబర్ 15:** నారాయణపురం గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. వైయస్సార్ కాలనీ సీ-బ్లాక్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు గ్రామ పంచాయతీ నిధులు రూ.1.60 కోట్లు, ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వంటి సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్నీ వీరాంజనేయులు, గ్రామ సర్పంచ్ దిడ్ల అలకనంద, ఉప సర్పంచ్ మరడ సాంబశివరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే కూటమి నాయకులు అక్కిన నాగమణి, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్, కృష్ణమోహన్, ఎంపీడీవో రాజ్ మనోజ్, డిప్యూటీ ఎంపీడీవో జి.రమేష్ బాబు, గుత్తేదారుడు అక్కిన శేషు, తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరయ్యారు.

సర్పంచ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న గన్నీ వీరాంజనేయులు

నారాయణపురం గ్రామ సర్పంచ్ దిడ్ల అలకనంద పుట్టినరోజు సందర్భంగా సోమవారం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆప్కాబ్ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్నీ వీరాంజనేయులు కేక్ కట్ చేసి సర్పంచ్ అలకనందకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థాన డైరెక్టర్‌గా కుమారి

**ర్యాలి టీడీపీ యువత శుభాకాంక్షలు**



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 15:** కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన డైరెక్టర్‌గా ర్యాలి గ్రామం చెందిన పెండెం వెంకన్న సతీమణి కుమారి డైరెక్టర్ గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ర్యాలి గ్రామ తెలుగు దేశం పార్టీ యువత నాయకులు సోమవారం ఆమె స్వగృహానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కుమారిని దుశ్శాలువాతో సత్కరించి, ఆమెకు దేవస్థాన డైరెక్టర్‌గా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. భక్తుల సౌకర్యాలు, ఆలయ అభివృద్ధికి ఆమె సేవలు మరింత ఫలప్రదంగా ఉండాలని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువత నాయకులు షేక్ గౌస్, గుడేల నాగేంద్ర గౌడ్, అత్తిలి వెంకట్, పల్లేటి నరసింహమూర్తి, కౌరు రామకృష్ణ, బుడ్డిగ అయ్యప్ప తదితరులు పాల్గొని అభినందనలు తెలియజేశారు.

## చెస్ పోటీలలో రాజ్ తరుణ్ ప్రతిభ



**అల్లవరం,పెన్ పవర్,డిసెంబర్15:** భీమవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ర్యాపిడ్ చెస్ పోటీలలో అల్లవరం మండలం ఎలువల్లంక గ్రామం మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థి గంటా రాజ్ తరుణ్ అండర్-09 కేటగిరీలో ద్వితీయ స్థానం సాధించాడు. అమలాపురం విక్టరి అకాడమి లో చెస్ శిక్షణ పొందుతున్నాడు. ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య మరియు చెస్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు

## రబీలో సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు...



**కాట్రేనికోన పెన్ పవర్ డిసెంబర్ 15:** కాట్రేనికోన మండలంలో త్వరలో మొదలుకానున్న రబీ సీజన్ కు సంబంధించి శివారు ఆయకొట్టుకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నామని నీటి సంఘం డిసి చైర్మన్ ఆకాశం శ్రీనివాస్ తెలిపారు. పల్లంకురు ప్రధాన పంట కాలువలో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టారు .సుమారు పది రోజులుగా మురమళ్ళ నుంచి ఈ పనులు ప్రారంభించామన్నారు. పల్లంకురు డాం సెంటర్ వరకు గుర్రపు డెక్క తొలగింపు చేపడతామన్నారు . ప్రధాన కాలువను అనుకుని ఉన్న ఎన్.కొత్తపల్లి కందికుప ,పల్లం దొంతికుర్రు తదితర కాలువల్లోనూ ఈ పనులు చేయిస్తామని ఆయన తెలిపారు...

## నేషనల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న రామకృష్ణ రాజు




**తాళ్లపూడి, పెన్ పవర్, డిసెంబర్ 15:**

హైదరాబాద్ హైటెక్స్ నందు ఈ నెల 13వ తేదీ శనివారం జాతీయ స్థాయి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్న స్వర్ణభారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణ రాజు. ఈ నేపథ్యంలో స్వర్ణ భారతి కీర్తి కిరీటంలో మరోకలికితురాయి అని, విద్యా రంగంలో విశేష సేవలందిస్తున్న స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును సాధించిందని కరస్పాండెంట్ రామకృష్ణ రాజు అన్నారు. దేశ వ్యాప్తంగా విద్యా ప్రమాణాలను ప్రోత్సహిస్తున్న ప్రతిష్టాత్మక సంస్థ 'బ్రెయిన్‌ఫీడ్' స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ను "నేషనల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్" అవార్డుకు ఎంపిక చేసిందని తెలిపారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో బ్రెయిన్‌ఫీడ్ ఆర్గనైజర్, ప్రముఖ విద్యావేత్త కె.వి.బ్రహ్మం, జిఎన్ఐటీఎస్ డైరెక్టర్ డాక్టర్ సామల నాగరాజ్ చేతుల మీదుగా స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణారాజు ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. విద్యా విధానంలో వినూత్న మార్పులు, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడం, ఉత్తమ ఫలితాలను సాధించడంలో స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ చూపుతున్న చొరవను గుర్తించి ఈ అవార్డును అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## మందపల్లి శ్రీ మందేశ్వర దేవస్థానం అభివృద్ధికి గవర్నర్ అశోక గజపతి రాజు ఆశీస్సులు



**కొత్తపేట, పెన్ పవర్, డిసెంబరు15:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలోని దేవాదాయ–ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న శ్రీ మందేశ్వర (శనీశ్వర స్వామి) వారి దేవస్థానానికి సంబంధించి నూతనంగా ఎన్నుకోబడిన ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లు సోమవారం గోవా గవర్నర్, దేవస్థానం చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ అయిన అశోక గజపతి రాజును ఆయన స్వగృహమునందు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ.ఓ. డి. సురేష్ బాబు ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్, డైరెక్టర్లు పాల్గొని ఆలయ పరిపాలన, నిర్వహణకు సంబంధించి తమ సహకారం అందిస్తామని తెలిపారు. నూతన ట్రస్ట్ బోర్డు ద్వారా దేవస్థానం అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందనే నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఈవో డి. సురేష్ బాబు ఆలయంలో అమలవుతున్న పూజా విధానాలు, ఆన్లైన్ పూజ విధానాలను, అన్నదానం,శనివారం నేతితో తయారు చేస్తున్న అన్నప్రసాధం ,భక్తుల సౌకర్యాలు, భద్రతా చర్యలు, పారిశుధ్య కార్యక్రమాలు, అలాగే భవిష్యత్‌లో చేపట్టనున్న అభివృద్ధి ప్రణాళికలను గవర్నర్ అశోక గజపతి రాజుకు సవివరంగా వివరించారు. ఆలయ ప్రాంగణ విస్తరణ, భక్తుల కోసం వసతి, తాగునీరు, క్యూ లైన్‌ల మెరుగుదల వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది.దేవస్థానం కార్యకలాపాలపై సంతృప్తి వ్యక్తం చేసిన గవర్నర్ అశోక గజపతి రాజు, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ట్రస్ట్ బోర్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆలయ అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడుతూ సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు.ఈ సమావేశంతో శ్రీ మందేశ్వర (శనీశ్వర స్వామి) దేవస్థానం అభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడిందని భక్తులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వృద్ధాశ్రమంలో సినీ హాస్యనటి వాసుకి (పాకీజా)



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 15**:తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రముఖ హాస్యనటి వాసుకి (పాకీజా) ప్రస్తుతం అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో నివసిస్తున్నారు. 'అసెంబ్లీ రౌడీ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన వాసుకి 60కి పైగా తెలుగు సినిమాల్లో నటించారు.తనకు సినీ రంగంలో అవకాశం ఇచ్చిన మోహన్ బాబు, కంటి చికిత్సకు ఆర్థిక సాయం చేసిన మంచు విష్ణు, అలాగే చిరంజీవి కుటుంబం, పవన్ కళ్యాణ్, చంద్రబాబు, లోకేష్ సహకారం అందించారని ఆమె తెలిపారు. తనకు పెన్షన్, రేషన్ కార్డు, నివాస స్థలం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను వాసుకి కోరారు. గోదావరి తీరంలోనే జీవితాంతం గడపాలన్నదే తన కోరిక అని పేర్కొన్నారు.

## చింతారావుకు ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్ ఆర్థిక సహాయం



**రావులపాలెం పెన్ పవర్ డిసెంబర్ 15:** రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామానికి చెందిన చింతారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో జరగడంతో తీవ్రంగా గాయపడిన పాశం చింతారావు యాదవ్‌కు రావులపాలెం ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్ ఆర్థిక సహాయం అందించింది. కుడిచేతి కాలర్‌బోన్ విరిగిపోవడంతో ప్రస్తుతం చికిత్స పొందుతున్న చింతారావును ఎల్ఐసి ఏజెంట్లు పరామర్శించారు.ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నాయుడు వెంకట్రావు ఆధ్వర్యంలో ఏజెంట్లు చింతారావుకు రూ.5,000 నగదు సహాయాన్ని అందజేశారు. ప్రమాద సమయంలో కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి యూనియన్ తరఫున సహకారం అందించినట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెరవలి వెంకటేశ్వరరావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ డి.ఆర్.కె. రాజు, ట్రెజరర్ సూరంపూడి శ్రీనివాసరావు, సీనియర్ ఏజెంట్ గంధం నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కిర్లంపూడి ఏఎన్ఎల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**కిర్లంపూడి, పెన్ పవర్, డిసెంబర్ 15:**కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి ఏఎన్ఎల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పాఠశాల కరస్పాట్ మధులతాజగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు అంబరాన్ని అంటాయి.ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ముఖ్య అతిధిగా విచ్చేసి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు ముందుగా కేక్ కట్ చేసి, స్కూల్ పిల్లలకు పంచిపెట్టారు పిల్లలు మేరీ మాత వేషధారణలతో చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. పాస్టర్ విజయ్ కుమార్ అందించిన క్రిస్మస్ సందేశం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు శరకణం రాజుబాబు, పెంటకోట సాయిబాబు,దాడి పెదబుజ్జి, మళ్ల నాగు, సంఘన వెంకటేశ్వరరావు, కట్టు సూరిబాబు, ఎల్లపు శివరామకృష్ణ , పాముల వీరబాబు, నల్ల, పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు



## సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్ పార్క్ గ్రంథాలయానికి సరికొత్త రూఫ్ ఏర్పాటు



**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 15:**కాకినాడ నగరంలోని గాంధీనగర్ పార్క్‌లో ఉన్న గ్రంథాలయం రూఫ్ శిథిలావస్థకు చేరుకోవడంతో పాఠకులు, గ్రంథాలయ అధికారి చేసిన అభ్యర్థన మేరకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ స్పందించి తక్షణమే చర్యలు చేపట్టింది. సుమారు రూ. లక్ష రూపాయల వ్యయంతో గ్రంథాలయానికి సరికొత్త రూఫ్‌ను ఏర్పాటు చేసి పాఠకులకు మెరుగైన సౌకర్యం కల్పించింది. సోమ వారం ఉదయం గాంధీనగర్ పార్క్‌లో ఆధునీకరణ చేసిన గ్రంథాలయాన్ని ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి కలిసి పరిశీలించారు.కొత్తగా ఏర్పాటు చేసిన రూఫ్ పనుల నాణ్యతపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రంథాలయానికి వచ్చిన పలువురు పాఠకులు, గత కొంతకాలంగా వర్షాకాలంలో నీరు లీక్ అవడంతో పుస్తకాలకు నష్టం కలుగుతోందని, ఇప్పుడు నూతన రూఫ్‌తో ఆ సమస్య పూర్తిగా తొలగిపోయిందని తెలిపారు. సమస్యను సత్వరమే పరిష్కరించి నందుకు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్‌ను, అలాగే కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తిని పాఠకులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా తలాటం హరీష్ మాట్లాడుతూ,"గ్రంథాలయాలు విజ్ఞాన భండారాలు.అవి కేవలం పుస్తకాలు చదివే కేంద్రాలే కాకుండా,మన సంస్కృతి, సంప్రదాయాలు,విలువలను భవిష్యత్ తరాలకు అందించే ముఖ్యమైన వేదికలు. అటువంటి గ్రంథాలయాలు సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉండేలా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.ఈ దిశగా సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుంది" అని అన్నారు.అదే విధంగా మేకా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ,రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ప్రోత్సాహంతో విద్య, విజ్ఞానం, యువతాభివృద్ధి లక్ష్యంగా ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఇది మరో కీలక అడుగని తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకుల సౌకర్యాల పెంపుదలకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వెంకటరమణ, కృష్ణమూర్తి,రామారావు, సత్యనారాయణ శర్మ, రామశేషాద్రి, లైబ్రేరియన్ అహల్యాదేవి, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన పరిరక్షణతో ఏటా 53.60 మిలియన్ టన్నుల చమురు పొదుపు

### కేంద్రం స్పష్టీకరణ

**కాకినాడ పెన్ పవర్ ,డిసెంబర్ 15:**దేశవ్యాప్తంగా గృహాలు,భవనాలు, పరిశ్రమలు,రవాణా,వ్యవసాయ రంగాల్లో అమలైన ఇంధన పరిరక్షణ పథకాల ద్వారా 2023–24 సంవత్సరంలో ఏటా 53.60 మిలియన్ టన్నుల చమురు సమాన ఇంధన పొదుపు సాధ్యమైందని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీపాద నాయక్ వెల్లడించారు. ఈ ఇంధన పొదుపు ద్వారా సుమారు రూ.2 లక్షల కోట్ల వ్యయ తగ్గింపు జరిగినట్లు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) అంచనా వేసిందన్నారు. అయితే రాష్ట్రాలు లేదా జిల్లాల వారీగా ఇంధన పొదుపు వివరాలను లెక్కించడం లేదని మంత్రి స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన పరిరక్షణ పథకాల అమలుపై రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. ఇంధన పరిరక్షణ భవన నియమావళి (ఈసీబీ సీ) కనీసం 100 కిలోవాట్ల కనెక్టెడ్ లోడ్ లేదా 120 కేవీఏ కాంట్రాక్ట్ డిమాండ్ ఉన్న కొత్త భవనాలకు వర్తిస్తుందని తెలిపారు.దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సుమారు 1,400 పట్టణ స్థానిక సంస్థలు ఈసీబీసీను స్వీకరించినట్లు పేర్కొన్నారు. అయితే ఈసీబీసీకు అనుగుణంగా నిర్మితమైన భవనాల రాష్ట్ర లేదా జిల్లా వారీ జాబితాను బిఈఈ నిర్వహించడం లేదని మంత్రి స్పష్టంచేశారు.అలాగే ఉజాలా (ఉజాల) పథకం 2015లో ప్రారంభమై లక్ష్యాలు పూర్తయ్యాక 2019లో ముగిసిందని తెలిపారు. ప్రస్తుతం ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ ఎల్) ద్వారా ఆన్‌లైన్ మరియు సంస్థాగత మార్గాల ద్వారా మాత్రమే లెడ్ బల్బుల విక్రయం కొనసాగుతోందని మంత్రి వివరించారు.



## ఈనెల 21న జిల్లాలో పల్స్ పోలియో




### పల్స్ పోలియో పోస్టర్ ఆవిష్కరించిన డి ఆర్ ఓ టి. సీతారామ మూర్తి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, డిసెంబర్ 16:**జిల్లాలోఈనెల 21, 2025 (ఆదివారం) న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామ మూర్తి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పల్స్ పోలియో కి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీతారామ మూర్తి మాట్లాడుతూ, పుట్టిన శిశువుల నుంచి ఐదు సంవత్సరాల వయస్సు లోపు పిల్లలందరికీ ఒక విడత పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. దేశంలో ప్రస్తుతం పోలియో కేసులు నమోదు కాకపోయినా, పొరుగు దేశాలలో పోలియో కేసులు వెలుగుచూస్తున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో 0%–%5 సంవత్సరాల వయస్సు గల 1,89,550 మంది పిల్లలను లక్ష్యంగా నిర్ధారించినట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 1,084 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రయాణంలో ఉన్న పిల్లల కోసం ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో 62 ట్రాన్సిట్ టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పట్టణ మురికివాడలు, వలస కార్మిక ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు తదితర హై రిస్క్ ఏరియాలలో పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి 53 మొబైల్ టీంలు నియమించినట్లు తెలిపారు.

గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో డిసెంబర్ 19, 20 తేదీలలో విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

డిసెంబర్ 21న అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, పల్స్ పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, డిసెంబర్ 22, 23 తేదీలలో పల్స్ పోలియో టీంలు ఇంటింటికి వెళ్లి, 21న పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి వారికి చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమం కోసం 46,852 మంది టీమ్ మెంబర్లను నియమించామని, కార్యక్రమ పర్యవేక్షణకు 10 మంది మానిటరింగ్ అధికారులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్, పురపాలక, రెవెన్యూ, మత్స్య శాఖలతో పాటు అన్ని లైన్ డిపార్ట్మెంట్లు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కె. వెంకటేశ్వరరావు, జిల్లా కుటుంబ సంక్షేమ శాఖాధికారి (డీసీహెచ్ఎస్) డా. పి. పద్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల్లో కిర్లంపూడి సివి రామన్ జూనియర్ కాలేజీ విద్యార్థినికి ద్వితీయ స్థానం

- అభినందించి శుభాకాంక్షలు తెలిపిన అధినేత శరకణం జయరాం



**కిర్లంపూడి,పెన్ పవర్,డిసెంబర్ 15**:పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా 100 జయంతి సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో కాకినాడ జిల్లా కిర్లంపూడిలో ఉన్న సి వి రామన్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఎంపిసి) చదువుతున్న శరకణం నీలా అన్నపూర్ణ సత్య పార్వతి కాకినాడ జిల్లా కాలేజీల విభాగం నుండి ద్వితీయ స్థానం సాధించింది.ఆదివారం కాకినాడలో జరిగిన బహుమతుల ప్రధానంలో ద్వితీయ బహుమతి అందుకున్న శరకణం నీలా అన్నపూర్ణ సత్య పార్వతిని కళాశాల అధినేత శరకణం జయరాం కళాశాల యాజమాన్యం తరపున అధ్యాపక బృందం,విద్యార్థుల తరపున అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ అమ్మాయి కళాశాల అధినేత శరకణం జయరాం కుమార్తె కావడం విశేషం.

## సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి




**కాకినాడ, పెన్ పవర్,డిసెంబర్ 15:**కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ ఔట్‌సోర్సింగ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ద్వితీయ మహాసభ సోమవారం సాయంత్రం స్థానిక సాంబమూర్తి నగర్, రెవెన్యూ కాలనీ రోడ్‌లోని దుర్గమ్మ గుడి పక్కన ఉన్న పి.ఆర్ భవన్‌లో వనమాడి కాటవేణి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రులు (జీజీహెచ్), వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, మెడికల్ కాలేజీలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని విధానం ఒకటేనని, పని సమయం కూడా ఒకటేనని, అలాంటి పరిస్థితుల్లో కార్మికుల శ్రమను దోచుకోవడం అన్యాయమని, శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని అన్నారు.కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో శానిటేషన్ కార్మికులకు రూ.13,960 మంజూరు చేసి, చేతికి కేవలం రూ.800 మాత్రమే అందజేస్తున్న పరిస్థితి ఉందని, ఇలాంటి వేతన భేదాలు కార్మికుల్లో విభేదాలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. అన్ని ఆసుపత్రుల్లో ఒకే విధమైన వేతన విధానం అమలు చేయాలని కోరారు.ప్రభుత్వ అధికారులు, వైద్య శాఖ అధికారులు, మంత్రుల సమక్షంలో కుదిరిన ఒప్పందం మేరకు జీఓ నెం.138 ప్రకారం శానిటేషన్, సెక్యూరిటీ, పేస్ట్ కంట్రోల్ కార్మికులకు రూ.18,600 వేతనం మంజూరు చేయాలని తెలిపారు. కమిషన్లు పోగా రూ.16,000, అందులో ఈపీఎఫ్, ఈఎస్ఐ మినహాయింపుల తర్వాత కనీసం రూ.14,000 జీతం కార్మికులకు అందాల్సి ఉండగా, జీజీహెచ్ తప్ప జిల్లా వ్యాప్తంగా ఎక్కడా అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా అంతటా ఒకే విధంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.రంగరాయ మెడికల్ కాలేజ్‌లో అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్‌ను ఏఐటీయూసీ అనుబంధ సంఘంగా 2021లో ఏర్పాటు చేసినట్లు, ఇది యూనియన్ యొక్క ద్వితీయ మహాసభ అని ఆయన తెలిపారు. శానిటేషన్ కార్మికులకు జీతాలు సక్రమంగా అమలు కాకపోయినా, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల్లో లోపాలు ఉన్నా ఏఐటీయూసీ కార్మికులకు అండగా నిలబడి వారి శ్రేయస్సు కోసం నిరంతరం పోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధి బొబ్బిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ రంగరాయ మెడికల్ కాలేజ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్‌కు తమ యూనియన్ తరఫున అభినందనలు తెలియజేస్తూ, కార్మికుల సమస్యల పరిష్కారానికి పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నమ్మి బాలకృష్ణ, కాటవేణి, శివకుమార్, మోహన్, రామలక్ష్మి, సత్య, ఆంటోనీ రామారావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

మినీ అంగన్వాడి కేంద్రాల స్థాయి పెంచిన ప్రభుత్వం

ఎమ్మెల్యే,రాష్ట్ర సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, డిసెంబర్ 15:**అంగన్వాడీ కేంద్రాల్లో అందించే సేవలను మరింత పటిష్ఠంగా అమలుచేసే విధంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రంపచోడవరం ఎమ్మెల్యే,రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి అన్నారు. రంపచోడవరం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో సోమవారం అంగన్వాడీ కార్యకర్తలకు చరవాణి లు పంపిణీ కార్యక్రమం ఐటిడిఎ పథక నిర్వహణ అధికారి బచ్చు స్మరణ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో అందించే సేవలను కూటమి ప్రభుత్వం పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పిల్లలు సౌలభ్యం రీత్యా వారికి అందించే ఆహారం, పూర్వ ప్రాథమిక విద్య విధానాలు సులభంగా అందించేందుకు విస్తృత స్థాయిలో కార్యకర్త లకు మరింత నైపుణ్యం కల్పిస్తుందన్నారు. వారికి అందించే ఆహారం లో కూడా పూర్తి నాణ్యత తో ఉండేలా చూస్తూ ప్రాథమిక విద్య కు సిద్ధం చేసే బాధ్యత కార్యకర్తలపై ఉందని సూచించారు. దీనిలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గంలో చింతూరు డివిజన్ లోని 93 మినీ అంగన్వాడీ కేంద్రాలను అంగన్వాడీ కేంద్రాలుగా, రంపచోడవరం డివిజన్ లోని 91 మినీ అంగన్వాడీ కేంద్రాలను అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



మంజూరు చేసిన్నట్లు తెలిపారు.కార్యకర్తల కొరకు కేంద్రాల్లో అందించే సేవలపై ప్రతీ రోజు సంబధిత ఉన్నత అధికారులకు అంతర్జాలంలో అందించే విధంగా చింతూరు డివిజన్ లోని 432మంది కార్యకర్తలకు , రంపచోడవరం డివిజన్ లోని 582మంది కార్యకర్తలకు శాంసంగ్ 5జి చర వాణీలు అందజేశారు. కార్యక్రమంలో సిడిపిఓ లు కె. ఉమ, సుజాత, పి క్రాంతి కుమారి, సుచరిత ఆదిలక్ష్మి , శాంతి తదితరులు పాల్గొన్నారు.

## శైవాగమ పండితునికి సత్కారం



**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 15:**భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలో " భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సేవా సమితి వారి " ఆధ్వర్యంలో సత్య సాయి బాబా శతజయంతోత్సవాల్లో భాగంగా ఊబలంక సత్యసాయి మందిరములో ఆలమూరు వాస్తవ్యులు శైవాగమపండితులు ఉపన్యాస వాచస్పతి ప్రతిష్టాచార్య టి టి డి వార్షిక సత్కార పండితులు బ్రహ్మశ్రీ కాళ్ళకూరి సూరి పండు గారికి సత్యసాయి సేవా సమితి వారు చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతిని మన ధర్మాన్ని మనం కాపాడే ప్రయత్నం చేస్తూ మన భావితరాల వారికి తెలియజేయాల్సిన అవసరం నేటి తరానికి చెందిన మనందరిపై ఉందన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘన నివాళులు
- జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఐపీఎస్



**భీమవరం, నవంబర్ 14 (పెన్ పవర్ స్టేట్ బ్యూరో):**

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి వర్ధంతిని పురస్కరించుకుని, పశ్చిమ గోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళు లర్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి, ఐపీఎస్ గారు అమరజీవి పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ..

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు గారు చేసిన ప్రాణత్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన చూపిన పట్టుదల, మనోనిబ్బరం, త్యాగస్ఫూర్తి భావితరాలకు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారు చూపిన మార్గంలో నడవడమే వారికి మనం అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ శ్రీ ఎం.వి.వి. సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కె.వి.వి.ఎన్. సత్యనారాయణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) శ్రీమతి ఇ. ఇందుమతి, జిల్లా ఐటీ కోర్ ఎస్సై శ్రీ ఎస్. రవికుమార్, ఆర్ఎస్సై శ్రీ కె. గోపికృష్ణతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నరు

## సిద్ధార్ధ నగర్ పార్క్ సమస్యల పరిష్కారానికి చర్యలు



ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ

**కాకినాడ ,పెన్ పవర్, డిసెంబర్ 15:**కాకినాడ నగరంలోని సిద్ధార్థ నగర్ పార్క్‌లో నెలకొన్న పలు సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు.సోమవారం ఉదయం డివిజన్ పర్యటనలో భాగంగా ఆయన ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డును సందర్శించి శానిటేషన్ నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్ బై ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులను గుర్తించిన కమిషనర్, తక్షణమే ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. రోడ్ మార్జిన్‌పై వ్యాపారాలు నిర్వహించడం సరికాదని హెచ్చరించారు.అనంతరం సిద్ధార్థ నగర్ పార్కును సందర్శించిన ఇంచార్జ్ కమిషనర్‌కు పార్క్ అభివృద్ధి కమిటీ సభ్యులు అక్కడి సమస్యలను వివరించారు. పార్కు ప్రహరీ గోడకు రంగులు వేయాల్సిన అవసరం ఉందని, శానిటేషన్ నిర్వహణ మెరుగుపరచాలని, పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన క్రీడా సామాగ్రి పూర్తిగా దెబ్బతిన్నందున కొత్త ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.ఈ సందర్భంగా ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, డివిజన్ పర్యటనలో భాగంగా పార్కును పరిశీలించామని తెలిపారు. పార్క్ అభివృద్ధి కమిటీ సభ్యులు సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రహరీ గోడకు రంగులు స్వయంగా వేయడానికి కమిటీ సభ్యులు ముందుకు రావడం మంచి పరిణామమని పేర్కొన్నారు.ఇదే తరహాలో నగరంలోని ఇతర ప్రాంతాల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కూడా తమ ప్రాంతాల పార్కుల అభివృద్ధికి భాగస్వాములు కావాలని సూచించారు.అనంతరం డివిజన్‌లో విస్తృతంగా పర్యటించిన కమిషనర్ శానిటేషన్ పనులను పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే సిద్ధార్థ నగర్ రోడ్ నంబర్%–%2లోని శ్రీ వంగా గీత విశ్వనాథ్ పార్కును సందర్శించి అక్కడ అసంపూర్తిగా నిలిచిన భవనాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు వై.డి. రామారావు, సిద్ధార్థ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేక సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ అభ్యున్నతికి రాజా కృషి మరువలేం

వైద్యాధికారులు భవానీశంకర్, సాయికిషోర్, భాగ్యశ్రీ వెల్లడి

**ఆలమూరు, పెన్ పవర్, డిసెంబర్ 15:**మండలంలోని పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభ్యున్నతికి, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించే సేవలను నిరంతరం పర్యవేక్షిస్తూ హెచ్‌ఈఓగా ఏవివి.రాజా అక్కుల అందించిన సేవలను మరువలేనివని రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ వైద్యాధికారి పి,భవానీశంకర్, వైద్యాధికారులు డి,సాయికిషోర్, కె.భాగ్యశ్రీ అన్నారు.స్థానిక పీహెచ్‌సీలో హెచ్‌ఈఓగా పనిచేసి పదోన్నతిపై భీమవరం డిఎంహెచ్‌ఓ కార్యాలయానికి డిప్యూటీ డెమోగా వెళ్లిన రాజాకు సోమవారం ఘన సత్కారం జరిగింది. ఈసందర్భంగా పీహెచ్‌సీకి అందించిన సేవలను పలువురు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని పదోన్నతులు సాధించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆకాక్షించారు. అనంతరం రాజా, ధనలక్ష్మి దంపతులకు దుశ్శాలువ కప్పి పూలమాలలు వేసి మెమొంటోను బహుకరించి ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, సూపర్‌వైజర్ ముద్రగడ శ్రీనివాసరావు, ఫార్మాసిస్టు డి.సుగుణ లక్ష్మి, ఎస్ఎన్‌లు ఎన్ లక్ష్మీ, ఎం.సత్యవతి, లాబ్ టెక్నిషియన్ పి,రాజారమేష్‌కుమార్, హెల్త్



అసిస్టెంట్లు వి.సుబ్బారావు, ఆర్.నాగేశ్వరరావు, ఏవి కృష్ణారావు, వై.వెంకటేశ్వరరావు. ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకన్న నిత్య అన్నదాన పథకానికి విరాళం అందించిన భక్తులు



**ఆత్రేయపురం పెన్ పవర్ డిసెంబర్ 15:**కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. సోమవారం ఆలయ సన్నిధిలో వేకువజామున మేలుకొలుపు సేవ, ఐశ్వర్య లక్ష్మి హోమం, అలంకార ఉత్సవం, సుప్రభాత సేవలను ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు.

అనంతరం స్వామివారి వసంత మండపంలో నిత్య కళ్యాణం, అష్టోత్తర పూజలు ఘనంగా జరిగాయి. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి కాకినాడ జిల్లా, కరప మండలం, పెనుగుదూరు గ్రామానికి చెందిన అనిశెట్టి భరతబాబు %–% నాగదుర్గ దంపతులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి రూ.53,902/- విరాళంగా సమర్పించారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వదించగా, ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

## జనార్ధనస్వామిని దర్శించుకున్న వాడపల్లి దేవస్థానం ప్రధానార్చకులు.

**ఆలమూరు,పెన్ పవర్, డిసెంబర్ 15:**నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి వారిని సోమవారం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రధాన అర్చక బృందం దర్శనం చేసుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం ఆలయ అర్చకులు. ఖండవల్లి ప్రభాకర్ ఆచార్యులు, అంగర రంగాచార్యులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీమహావిష్ణువు ఏక వింశతి అవతారాల్లో ఒకటైన జనార్ధన స్వామి వారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు.




## పొట్టి శ్రీరాములు త్యాగఫలితమే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం

- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్



**కాకినాడ, పెన్ పవర్, డిసెంబర్ 15:**అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానం ఫలితంగానే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని, ఆయన త్యాగనిరతి తెలుగు ప్రజలకు ఎప్పటికీ చిరస్మరణీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు.సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ, స్వతంత్ర సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు మూల పురుషుడైన పొట్టి శ్రీరాములు తెలుగువారందరికీ చిరస్మరణీయుడని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఆయన 48 రోజుల పాటు కఠోర నిరాహార దీక్ష చేసి అమరుడయ్యారని గుర్తు చేశారు. ఆయన అచంచల దీక్ష, పట్టుదల, అపార త్యాగం ఫలితంగానే తెలుగు భాష మాట్లాడే ప్రజలందరికీ ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమని, ఆయన చూపిన త్యాగబాటను, అచంచల దీక్షను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం.లల్లి, కలెక్టరేట్ ఏవో ఎస్.రామ్మోహన్ రావు,సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.జగన్నాథం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం సహించం

- నిర్ణీత గడువులోగా బాధితులకు న్యాయం జరగాలి
- జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఐపీఎస్



**భీమవరం, నవంబర్ 15 (పెన్ పవర్ స్టేట్ బ్యూరో):**పోలీస్ స్టేషన్లకు వచ్చే సామాన్య ప్రజల సమస్యల పట్ల అధికారులు అత్యంత సున్నితంగా స్పందించాలని, ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి, ఐపీఎస్ గారు ఆదేశించారు.

సోమవారం భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం %–% పీజీఆర్ఎస్ / మీకోసం)" కార్యక్రమంలో ఎస్పీ గారు స్వయంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యల నేపథ్యాన్ని తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 11 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు వంటి సివిల్ వివాదాలతో పాటు, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, అధిక వడ్డీల వేధింపులు, ప్రేమ పేరుతో మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వచ్చినట్లు పేర్కొన్నారు.

ఎస్పీ గారు మాట్లాడుతూ%"% ప్రజలు ఎంతో నమ్మకంతో పోలీస్ శాఖను ఆశ్రయిస్తారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తాత్కాలిక ఉపశమనం కాకుండా, సమస్య మళ్లీ పునరావృతం కాకుండా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేశారు.

ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో ఫోన్ ద్వారా మాట్లాడిన ఎస్పీ గారు, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కె.వి.వి.ఎన్. సత్యనారాయణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీ దేశంశెట్టి వెంకటేశ్వరరావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంసాద్ ఖేల్ మహోత్సవం లో యువత పాల్గొవాలి.

ఎంపీడీవో రాజ్ మనోహర్

**గోపాలపురం, పెన్ పవర్, డిసెంబర్ 15.** సంసాద్ ఖేల్ మహోత్సవ లో భాగంగా ఈనెల 17, 18 తేదీల్లో వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి రాజ మనోహర్ తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు లో పదవ తరగతి విద్యను అభ్యసించే విద్యార్థులు అలాగే గ్రామాల్లో ఉన్న 15 నుండి 21 సంవత్సరంలో వయస్సు ఉన్న విద్యార్థిని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న క్రీడామైదానంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖో,ఖో , ఫుట్ బాల్, యోగ, బ్యాడ్మింటన్ తో పాటు బాలుర 800 మీటర్ల, బాలికల 400 మీటర్ల పరుగు పందెం, షార్ట్ పుట్, లాంగ్ జంప్ వంటి పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ ఆధార్ కార్డుతో ఈనెల 18వ తేదీ లోపు స్థానిక పీడి అశోక్ ను సంప్రదించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలి అన్నారు. తదితర వివరాల కోసం 9440234389,8309112382 నంబర్లను సంప్రదించాలని ఎంపీడీవో సూచించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com